PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 305 | విజయవాడ, ఆదివారం 9 జూన్ 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 9 June 2024 | Rs

'ఇండియా' నేతలకు అందని ఆహ్వానం

- నేడు మోడీ ప్రమాణస్వీకారం
- సాయంత్రం 7.15 గంటలకు వేడుక
- దేశ, విదేశాల నుంచి 8 వేల మంది అతిథులు

5

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

టైటిల్ విజేత స్వైటెక్

- ఫైనల్లో పాలినీపై వరుససెట్లలో గెలుపు

6



రామోజీరావు ఇకలేరు

రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల సంతాపం

నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

రాష్ట్రంలో రెండు రోజులు సంతాప దినాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఈనాడు గ్రూప్ సంస్థల అధిపతి, ప్రముఖ వ్యాపారవేత్త, పద్మ విభూషణ్ చెరుకూరి రామోజీరావు (87) ఇకలేరు. దశాబ్దాలుగా తెలుగుప్రజలతో అనేకరకాలుగా మమేకమైన ఆయన శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతులు సంతాపం ప్రకటించారు.. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలియజేశారు. అధికారిక లాంఛనాలతో ఈ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. రామోజీ మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు రోజులపాటు సంతాప దినాలు ప్రకటించింది. రామోజీరావు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మూడు రోజుల క్రితం శ్వాసతీసుకోవడం కష్టం కావడంతో కుటుంబసభ్యులు ఆయన్ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య రమాదేవి, పెద్ద కుమారుడు కిరణ్ ఉన్నారు. చిన్న కుమారుడు సుమన్ 2012లో కేన్సర్‌తో చనిపోయారు.. పెద్ద కుమారుడు కిరణ్ ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్.ఈటీవి అధిపతిగా ఉన్నారు.

రామోజీ మరణ వార్త తెలియగానే టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఢిల్లీ నుండి హుటాహుటిన హైదరాబాద్‌కు చేరుకున్నారు. సతీమణి భువనేశ్వరితో కలిసిరామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, మాజీ ఎంపి పి. మధు తెలంగాణకు చెందిన పలువురు మంత్రులు, సినీ రంగానికి చెందిన ప్రముఖులు రామోజీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

రామోజీరావు అంత్యక్రియలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున అధికార ప్రతినిధు లుగా సీనియర్ అధికారులు ఆర్‌పి సిసోడియా, సాయిప్రసాద్, రజత్ భార్గవ్ హాజరుకానున్నారు.

ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ

- సిడబ్ల్యుసి తీర్మానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నియమించాలని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) తీర్మానం చేసింది. శనివారం నాడిక్కడ అశోక హొటల్‌లో సిడబ్ల్యుసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్ సహా సిడబ్ల్యుసి సభ్యులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఆ పార్టీ సీనియర్ నేత వేణుగోపాల్ మీడియా సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవి చేపట్టాలని రాహుల్‌ని సిడబ్ల్యుసి ఏకగ్రీవంగా కోరిందని తెలిపారు. పార్లమెంటు లోపల ప్రతిపక్షానికి నాయకత్వం వహించడానికి రాహుల్ సరైన వ్యక్తి అని అన్నారు. "కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేసిన భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర కాంగ్రెస్ ను దేశ ప్రజలకు మరింత దగ్గర చేసింది. ఆయన ఆలోచనలను, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఈ రెండు యాత్రలు దేశ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపులు.

లక్షలాది మంది కార్యకర్తలు, కోట్లాది మంది ఓటర్లలో ఆశలు, విశ్వాసాన్ని ఈ రెండు యాత్రలు నింపాయి" అని సిడబ్ల్యుసి తీర్మానంలో పేర్కొన్నారు."రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం సింగిల్ మైండెడ్ గా, పదునైనదిగా, సూటిగా సాగింది. 2024 ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణను ప్రధాన అంశంగా ఆయన చేశారు. ఎన్నికల ప్రచారంలో చాలా శక్తివంతంగా ప్రతిధ్వనించిన పాంచ్ న్యాయ్-పచీస్ హామీ కార్యక్రమం రాహుల్ యాత్రల ఫలితం. ఇందులో ప్రజలందరి భయాలు, ఆందోళనలు, ఆకాంక్షలను, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసిలు, ఒబిసిలు, మైనారిటీల ఆకాంక్షలు ప్రతిబింబించాయి" అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత పదవిని స్వీకరించడానికి రాహుల్ గాంధీ అంగీకరించారా? అని ప్రశ్నించగా, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ చెప్పారు. తమ నాయకుడు, కార్యకర్తలను ఉత్సాహపరచడంతో కాంగ్రెస్ పునరుజ్జీవనం ప్రారంభమైందని వేణుగోపాల్ అన్నారు. సిడబ్ల్యుసిలో నాలుగు నెలల క్రితంతో పోలిస్తే వాతావరణం పూర్తిగా భిన్నంగా, ఉత్సాహంగా ఉందని ఆయన అన్నారు. 'రాహుల్ గాంధీ కచ్చితంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత కావాలి. ఇది మా కార్యవర్గ అభ్యర్థన. ఆయన నిర్భయుడు, ధైర్యవంతుడు' అని సిడబ్ల్యుసి సమావేశం అనంతరం కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి ప్రమోద్ తివారీ అన్నారు. ఈ సిడబ్ల్యుసి సమావేశంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, కర్ణాటక సిఎం సిద్ధ రామయ్య, డికె శివకుమార్, హిమాచల్ సిఎం సుక్విందర్ సింగ్ సుకు, ఎపి నుంచి రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, జెడి శీలం, పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం కాంగ్రెస్ పార్ల మెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాత్రి ఎంపిలతో రాహుల్ గాంధీ విందు సమావేశం ఏర్పాటు చేశారు.

అమరావతి రైతుల్లో ఆశల చిగురు

- ఊపందుకోనున్న రాజధాని పనులు

ఐఎఎస్, ఐపిఎస్ తరహాలో ఉద్యోగులకూ జీరో సర్వీసెస్ బదిలీలు?

- 20 తర్వాత ఉండొచ్చని ప్రచారం

లోపలి పేజీలో..

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని ఉత్తరప్రదేశ్ వారణాసిలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నీట్ ఫలితాలపై నలుగురితో కమిటీ

- అక్రమాలపై ఫిర్యాదులతో పరిష్కారానికి కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ : నీట్ యుజి 2024 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వాటి పరిష్కారానికి నలుగురితో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర విద్యా శాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) శనివారం ప్రకటించాయి. పరీక్షా సమయాన్ని కోల్పోయి ఇబ్బంది పడడంతో గ్రేస్ మార్కులు ఇచ్చిన 1563మంది అభ్యర్థుల ఫలితాలను ఈ కమిటీ పున:పరిశీలిస్తుందని తెలిపాయి. ఈ కమిటీలో యుపిఎస్‌సి మాజీ చైర్మన్, మరో ముగ్గురు విద్యావేత్తలు సభ్యులుగా వున్నారు. కమిటీ ఇప్పటికే దర్యాప్తును ప్రారంభించింది. వచ్చే శనివారంలోగా తీర్పును వెలువరించవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ కమిటీ ఇచ్చే తీర్పు వల్ల ఇతరుల ఫలితాలపై ఎలాంటి ప్రభావం వుండబోదని ఎన్‌టిఎ పేర్కొంది. ఎంబిబిఎస్ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాబోతుందని తెలుసని అందువల్లే వచ్చే శనివారంలోగానే తీర్పు వస్తుందని, దానికి అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని, దీనివల్ల ఆడ్మిషన్ క్రమంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా వుండేందుకు ప్రయత్నిస్తామని ఎన్‌టిఎ చీఫ్ సుబోధ్ కుమార్ సింగ్ తెలిపారు. ఇప్పటివరకు, నార్మలైజేషన్ ఫార్ములా ప్రాతిపదికన మొత్తంగా 1563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చారు. ఇలా చేయడం వల్ల వీరిలో ఆరుగురికి ఉన్నత ర్యాంకులు వచ్చాయి. అయితే ఆ ఫార్ములా వివరాలను ఎన్‌టిఎ ఇంతవరకు వెల్లడించలేదు. ఆరు కేంద్రాల్లో 1563మంది విద్యార్థులు ఈ సమస్యను ఎదుర్కొన్నారని వెల్లడైంది. ఈ కేంద్రాలు చత్తీస్‌ఘడ్‌లో రెండు, మేఘాలయ, సూరత్, హర్యానా, చండీఘడ్‌ల్లో ఒక్కోటి వున్నాయి.

ఇదిలావుండగా నీట్ యుజి ఫలితాల వివాదం కోర్టుకు చేరింది. అనేకమంది విద్యార్థులు పలు హైకోర్టుల్లో పిటిషన్లు వేశారు. ప్రస్తుతానికి, ఢిల్లీ హైకోర్టులో నీట్ అభ్యర్థి వేసిన రిట్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో 29వ నెంబరు ప్రశ్నకు ఫైనల్ ఆన్సర్ కీని ఆ పిటిషనర్ సవాలు చేశారు. అలాగే కొద్ది సెంటర్లలో అభ్యర్థులకు ఇచ్చిన అదనపు సమయాన్ని కూడా సవాలు చేశారు. దీనిపై నోటీసులు జారీ తర్వాత 12వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేశారు. కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్‌లో మరో పిల్ దాఖలైంది. అందులో కొంతమంది అభ్యర్థులకు 718 లేదా 719 మార్కులు ఇవ్వడాన్ని పిటిషనర్ సవాలు చేశారు. దీనిపై 6న విచారణ జరగ్గా, ఎన్‌టిఎ అఫిడవిట్ దాఖలు చేయడానికి హైకోర్టు 10రోజులు గడువు ఇచ్చింది. రెండు వారాల తర్వాత దీనిపై తదుపరి విచారణ జరగనుంది.సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రతివాదులకు మే 17న నోటీసులు జారీ చేసిన సుప్రీం జులై 8కి విచారణను వాయిదా వేసింది. షెడ్యూల్డ్ తేదీ కన్నా 10 రోజులు ముందుగానే జూన్ 4న నీట్ ఫలితాలు వెలువడ్డాయి. జాతీయ స్థాయిలో ఏకంగా 67మందికి ఫస్ట్ ర్యాంకులు దక్కాయి. వీరిలో 17మందికి మెరిట్ ద్వారా ర్యాంక్ రాగా, ఫిజిక్స్ సెక్షన్‌లో తప్పుడు సమాధానం కారణంగా 44మంది విద్యార్థులకు ర్యాంక్ వచ్చింది. పరీక్ష సమయాన్ని కోల్పోయిన కారణంగా గ్రేస్ మార్కులు ఇవ్వడంతో మరో ఆరుగురికి ర్యాంక్ వచ్చింది.

వెనక్కి మళ్లిన విదేశీ పెట్టుబడులు..

రూ.14,794 కోట్లు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐ) భారీగా ఈక్విటీలను తరలించుకుపోయారు. గడిచిన ఒక్క వారంలోనే రూ.14,794 కోట్ల విలువ చేసే ఈక్విటీలను విక్రయించారు. 2024లో ఇప్పటి వరకు రూ.38,158 కోట్ల షేర్లను కొనుగోళ్లు చేశారు. గడిచిన ఏప్రిల్, మే, జూన్‌లో ఇప్పటి వరకు రూ.34,257 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు మొగ్గు చూపుతున్న తరుణంలోనూ విదేశీ ఇన్వెస్టర్లకు భారత మార్కెట్లపై విశ్వాసం సన్నగిల్లడం గమనార్హం. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు రూ.23,363 కోట్ల ఎఫ్‌పిఐలు తరలిపోయాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ స్ట్రాటజీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వికె విజయ్ కుమార్ తెలిపారు. చైనాలోని స్టాక్స్ చౌకగా ఉండటంతో చైనా ఎక్స్ఛేంజీలోని సూచీలపై విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

మెగా డిఎస్‌సి కోసం కసరత్తు

- పాత నోటిఫికేషన్ రద్దు?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇప్పటికే విడుదలై ఉన్న డిఎస్‌సి నోటిఫికేషన్‌ను రద్దు చేసి, దాని స్థానంలో కొత్త నోటిఫికేషన్ విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొట్టమొదటి సంతకం మెగా డిఎస్‌సి ఫైలుపైనే చేయనున్నారని, దానికి సంబంధించిన ఏర్పాట్లు సత్వరమే పూర్తిచేయాలని విద్యాశాఖకు ఆదేశాలు అందినట్లు సమాచారం. 12వ తేదినే ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉండటంతో విద్యాశాఖ అప్రమత్తమైంది. ఖాళీ పోస్టుల వివరాలు పంపాలని స్థాయి అధికారులు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం విడుదలై ఉన్న నోటిఫికేషన్‌లో 6,100 పోస్టులే ఉండగా, తాజాగా 13 నుండి 15 వేల ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. పాత నోటిఫికేషన్లోని 6,100 పోస్టుల్లో 2,280 ఎస్‌జిటి 2,299 స్కూల్ అసిస్టెంట్, 1264 టిజిటి, 215 పిజిటి, ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. వీటికి

సుమారు 3.30 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ పరీక్షలు నిలిచిపోయాయి.

దీంతో పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను కూడా నిర్వహించారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు నిర్వహించిన టెట్‌కు 2,67,559 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఫలితాలను కూడా ఎన్నికల కోడ్ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ విడుదల చేయలేదు. దీనిపై నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు కనీసం రెట్టింపు సంఖ్యలో పోస్టులను పేర్కొంటూ నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

- ముగ్గురు కార్మికులు మృతి
- ఆరుగురికి గాయాలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని నరేలా ప్రాంతంలో ఒక ఆహార శుద్ధి పరిశ్రమలో శనివారం ఉదయం చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు పరిశ్రమలోని మరికొందరికి కూడా గాయలయ్యాయని అధికారులు తెలిపారు. నరేలా పారిశ్రామిక వాడలోని పెసర పప్పు పరిశ్రమలో శనివారం ఉదయం 3.38 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని, సమాచారం అందిన వెంటనే 16 అగ్నిమాపక బృందాలతో అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చామని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ (డిఎఫ్‌ఎస్) ఛీఫ్ అతుల్ గార్గ్ తెలిపారు. పరిశ్రమలో ఉన్న ఒక పైపు నుంచి గ్యాస్ లీక్ కావడంతో మంటలు అలుముకొని, కంప్రెషర్ వేడిక్కిపోవడంతో భారీ పేలుడు సంభవించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు ఆయన తెలిపారు. మంటల్లో చిక్కుకున్న పరిశ్రమ నుంచి మొత్తం 9 మందిని బయటకు తీసుకొచ్చామని, వారిలో అప్పటికే తీవ్ర గాయాలవ్వడంతో ముగ్గురు చనిపోయారని, మిగిలిన ఆరుగురికి కూడా తీవ్ర గాయాలయ్యాయని, వారిని సప్దర్‌గంజ్ ఆసుపత్రికి

అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఆహార శుద్ధి పరిశ్రమ

తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఔటర్ నార్త్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ తెలిపారు. చనిపోయిన కార్మికులను వీర్‌పాల్ (42), శ్యామ్ (24), రామ్ (30)గా గుర్తించారు. ఈ పరిశ్రమ యజమానులను రోహిని ప్రాంతానికి చెందిన అంకిత్ గుప్తా, వినయ్ గుప్తా గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

అమెరికాలో కోరలు చాచిన నిరుద్యోగం!

- మే నెలలో మరింత ఉగ్రరూపం

వాషింగ్టన్ : అమెరికాలో నిరుద్యోగం రేటు మే మాసంలో నాలుగు శాతానికి పెరిగింది. గత రెండేళ్ల కాలంలోనే ఇది అధికమని అమెరికా కార్మిక విభాగం శుక్రవారం ప్రకటించింది. మే మాసంలో కొత్తగా 2,72,000 ఉద్యోగాలు కల్పించినా ఈ పరిస్థితి ఎదురైంది. అయితే ఇవన్నీ కూడా అనియత రంగాల్లోని ఉపాధి అవకాశాలే. ఇది కూడా గత 12 మాసాల కాలంతో పోలిస్తే సగటు నెలవారీ పెంపు 2,32,000 కన్నా ఎక్కువగానే వుంది. ఆరోగ్య సంరక్షణ, ఆతిథ్యం, వృత్తి నైపుణ్యం, శాస్త్ర, సాంకేతిక సేవలు వంటి రంగాలతో సహా పలు పరిశ్రమల్లో ఉపాధి పెరుగుతునే వుంది. మార్చి మాసానికి అనియత రంగాల్లో పే రోల్ ఉపాధి అవకాశాల్లో మార్పును 5వేలకు సవరించారు. దీంతో 3,10,000 ఉద్యోగాలు పొందారు. అలాగే ఏప్రిల్ మాసానికి 10వేలకు సవరించారు. దానివల్ల 1,65,000 ఉద్యోగాలు పొందారు. ఈ సవరణలతో, మార్చి, ఏప్రిల్ మాసాలకు కలిపి ఉపాధి అంతకుముందు చెప్పిన దాని కన్నా 15వేలు తక్కువగా వుంది. ఫిబ్రవరి మాసంలో నిరుద్యోగం రేటు 3.9శాతం పెరిగింది. ఇది గత రెండేళ్ళలోనే అత్యధిక స్థాయి. అంతకుముందు మార్చిలో స్వల్పంగా తగ్గి



3.8శాతానికి చేరుకుంది. ఏప్రిల్‌లో తిరిగి 3.9శాతానికి పెరిగింది. 2023 ఆగస్టు మాసం నుండి నిరుద్యోగం రేటు 3.7 శాతం నుండి 3.9శాతం మధ్యనే మారుతూ వస్తోందని లేబర్ బ్యూరో పేర్కొంది.

2022 జనవరి నుండి చూసినట్లైతే తాజాగా నమోదైన 4శాతాన్ని అత్యధికంగా పరిగణిస్తున్నారు. ఈ పరిస్థితి ఆర్థికవేత్తల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే అంతంత మాత్రంగా వున్న లేబర్ మార్కెట్ ఇంకా క్షీణిస్తుందనే భయం కలిగిస్తోందని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఈనాడు నెలకొన్న ఈ ఉపాధి డేటా ప్రభుత్వాన్ని వేచి చూసే ధోరణిలో పెడుతుందని వెల్స్ ఫార్గో సెక్యూరిటీస్‌కి చెందిన ఆర్థికవేత్త మైఖేల్ పగ్లీస్ వ్యాఖ్యానించారు. రాబోయే కాలానికి వడ్డీ రేట్లు తగ్గించేందుకు గానూ ఈ వేసవిలో మందగిస్తున్న ద్రవ్యోల్బణ నివేదికలను విధానకర్తలు పరిశీలించాల్సిన అవసరం వుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే వారం వెలువడనున్న వినిమయ ధరల సూచీ (సిపిఐ) నివేదికపైనే అందరి కళ్లు వున్నాయి.



వెబ్‌సైట్లలో ఫోటోలు తొలగించాలి

- జిఎడి ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వెబ్‌సైట్లలో ఇప్పటి వరకూ ఉన్న ఫోటోలనూ వెంటనే తొలగించాలని సాధారణ పరిపాలనశాఖ ఆదేశాలు జారీచేసింది. వెంటనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలనీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 108 శాఖలకు సంబంధించిన వివిధ డిపార్టుమెంట్లలో ఇప్పటికీ పాత క్యాబినెట్‌కు సంబంధించిన ఫోటోలే ఉన్నాయి. ఫోటో గ్యాలరీల్లోనూ పాత ప్రభుత్వంలోని సిఎంగానీ, మంత్రులుగానీ ఉన్నట్లయితే వాటిని కూడా వెంటనే తొలగించాలనీ అందులో పేర్కొన్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకార సమయం మార్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీ ఉదయం 9.27 గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారని ఎపి సిఎంఒ ట్వీట్ చేసింది. అంతకుముందు ఉదయం 11.27 గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారని ప్రకటించగా, తాజాగా సమయంలో మార్పు చేసింది. కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటిపార్కు వద్ద ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని తెలిపింది.

చేపమందు పంపిణీలో విషాదం : ఒకరి మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన చేప మందు పంపిణీ సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. క్యూలైన్‌లో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందారు. అబిడ్స్ ఎసిపి చంద్రశేఖర్, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన గొల్ల రాజన్న (60) చేపమందు తీసుకోవడానికి మనవడితో కలిసి శుక్రవారం రాత్రి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు వచ్చారు. శనివారం ఉదయం 6:30 సమయంలో క్యూ లైన్‌లో స్పృహ కోల్పోయారు. అతన్ని అంబులెన్స్‌లో పక్కనే ఉన్న కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు గుండెపోటుతో చనిపోయారని, అతనికి ఆస్తమా ఉందని వైద్యులు తెలిపారు.

'ల్యాండ్ టైట్లింగ్' రద్దు అవుతుందా?

- కేంద్రంతో ముడిపడి ఉందంటున్న అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివాదాస్పదంగా మారిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు విషయం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని టిడిపి ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఆ ప్రకటన ఎప్పుడు ఆచరణలోకి వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు రూపొందించిన చట్టం కావడంతో రద్దు వ్యవహారం కేంద్ర ప్రభుత్వంతో ముడిపడి ఉందని అధికారులు అంటున్నారు.

ఈ చట్టానికి - ఆర్థిక సంస్కరణలకు, సంస్కరణలకు - నిధులకు ముడిపడి ఉండటం టిడిపి వర్గాల్లో కూడా చర్చకు దారితీస్తోంది. రాష్ట్రం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేంద్రం నుండి పెద్ద మొత్తంలో నిధుల రూపంలో సహకారం కావాల్సిఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నిధులు రావడానికి అవకాశం ఉన్న ఏ ఒక్క మార్గాన్ని కూడా వదులుకునే అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, ల్యాండ్ టైటిల్ యాక్టు విషయంలో ప్రజలకు హామీ ఇచ్చి ఉండడటంతో కేంద్ర ప్రభుత్వాన్ని ఏదో రకంగా ఒప్పించడమే మార్గమని అంటున్నారు. అయితే, ఈ చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో పట్టుదలగా వ్యవహరించింది. మారిన పరిస్థితుల్లో ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.



గతంలో ఏం జరిగింది?

ల్యాండ్ టైట్లింగ్ యాక్టును అసెంబ్లీలో పెట్టే సమయంలోనే ప్రధాని ఆధ్వర్యంలోని నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు తాము ప్రవేశపెడుతున్నామని గత ప్రభుత్వం పేర్కొంది. అసెంబ్లీలో ఆమోదించిన తరువాత కేంద్రానికి పంపించారు. అక్కడ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని అంశాలను తొలగించి మరలా చట్టం చేయాలని సూచించారు. దీనిపై రెండోసారి అసెంబ్లీలో బిల్లుపెట్టి ఆమోదించి నీతి ఆయోగ్‌కు పంపించారు. వెంటనే అక్కడ కూడా ఆమోదం రావడంతో రాష్ట్రంలో అమల్లోకి తీసుకు వచ్చారు. అయితే, ఈ చట్టం అధికారుల ఇష్టాఇష్టాల మేరకు నడుస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బార్ కౌన్సిళ్లలోనూ ఈ చట్టానికి వ్యతిరేకంగా నెలరోజులపాటు నిరసన దీక్షా శిబిరాలు నిర్వహించారు. అభ్యంతరాలు ఉంటే నేరుగా హైకోర్టులో పిటీషన్ వేసుకోవాలని పెట్టిన నిబంధన వల్ల సాధారణ ప్రజలకు న్యాయం అందని ద్రాక్షగా మారుతుందని న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టం ప్రకారం . భూములపై ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వెంటనే దాన్ని డిస్ప్యూట్ రిజిస్టర్లో నమోదు చేస్తారు. దీనిపై నిర్దేశించిన అధికారికి దరఖాస్తు చేసుకోవాలి, ఆయన అంగీకరిస్తే సరి లేకపోతే ఇక దాన్ని విడిపించుకోవాలంటే హైకోర్టుకు వెళ్లాలి. దీనివల్ల భూములపై ప్రజలు హక్కులు కోల్పోతారని, పేదల నుండి భూములు లాక్కోవడం తేలికవుతుందనీ చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో చెప్పారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి

- పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1213వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఒ అండ్ సిసిపి విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, విళ్లా రామ్మోహన్ కుమార్, శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రజలు, కార్మికులకు మేలు చేకూర్చే నిర్ణయాలను కేంద్రంలోని సంకీర్ణ ప్రభుతం చేయాలని కోరారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రాష్ట్ర పార్టీలతోపాటు వివిధ రాష్ట్రాల్లో గెలిచిన భావ సారూప్యం కలిగిన పార్టీలకు మరోసారి పార్లమెంటు సమావేశాలకు ముందు విజ్ఞప్తి చేస్తామన్నారు. జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి ప్లాంటును చేర్చి, నిర్వీర్యం దిశగా కుట్రలు చేస్తున్న స్టీల్ యాజమాన్యం చర్యలను ఖండిస్తున్నామన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయి ఉత్పత్తి కోసం రూ.3500 కోట్ల వర్కింగ్ క్యాపిటల్‌ను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఉక్కు కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.కనకరాజు, ఎ.శివరామకృష్ణ, ఎస్‌కె.మొహిద్దీన్, ఎస్ఎస్.జగన్నాధరావు, నర్సింగరావు, పి.పెంటారావు పాల్గొన్నారు.

సిఎం ప్రమాణ స్వీకారానికి భారీ ఏర్పాట్లు

- సిఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈనెల 12న సిఎంగా చంద్రబాబునాయుడు గన్నవరం విమానాశ్రయం సమీపంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సభకు ప్రధాని మోడీ, గవర్నర్‌తో సహా పలువురు ప్రముఖులు రానున్న నేపథ్యంలో శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి సిఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శులు ఎం.రవిచంద్ర, శశిభూషణ్‌కుమార్, అదనపు డిజిపి బాగ్చి, టిఆర్ అండ్ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న, పౌరసరఫరాలు, ఉద్యానవన శాఖల కమిషనర్లు అరుణ్‌కుమార్, శ్రీదర్, సిఆర్‌డిఎ కమిషనరు వివేక్‌యాదవ్, ఎపి జెన్‌కో సిఎమ్‌డి చక్రధర్‌బాబు, ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు డికె బాలాజీ, ఢిల్లీరావు, విజయవాడ పోలీస్ కమిషనర్లు పిహెచ్‌డి రామకృష్ణ, మునిసిపల్ కమిషనరు స్వప్నిల్ దినకర్, ఎన్‌టిఆర్ జిల్లా జెపి సంపత్‌కుమార్, గన్నవరం విమానాశ్రయ డైరెక్టరు లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రివర్గ ప్రమాణస్వీకార ఏర్పాట్ల పర్యవేక్షణకు ఐదుగురు ఐఎఎస్‌లు

ఈనెల 12న జరుగునున్న మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమ ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రభుత్వం ఐదుగురు ఐఎఎస్ అధికారులను నియమించింది. ఐదుగురు ఐఎఎస్ అధికారులు తక్షణమే ప్రిన్సిపల్ సెక్రటరీ టూ గవర్నమెంట్ (పొలిటికల్) రిపోర్టు చేసుకోవాలని శనివారం అత్యవసర సర్క్యులర్ జారీ చేశారు. ఐదుగురు ఐఎఎస్ అధికారుల్లో బాబు ఎ, డాక్టర్ ఎమ్ హరి జవహర్‌లాల్, కె.కన్నబాబు, సిహెచ్ హరికిరణ్, జి. వీరపాండియన్ ఉన్నారు.

మంత్రివర్గంలో సీనియర్లకే పట్టం

- అభ్యర్థులకిచ్చిన హామీలూ పరిశీలన
- చంద్రబాబుతో పాటే ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన మంత్రివర్గంలో సీనియర్లకే పట్టం కట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయించినట్లు సమాచారం. మంత్రివర్గంలో స్థానం గురించి కొందరు అభ్యర్థులకు హామీ ఇచ్చి ఉండటంతో ఆ విషయాన్ని కూడా పరిశీలించాలని భావిస్తున్నట్లు తెలిసింది. టిడిపి కార్యాలయంలోనూ, ఆ పార్టీ నేతల్లోనూ శనివారం ఇదే చర్చనీయాంశమైంది. సీనియర్లలో ఎవరెవరికి పదవులు లభిస్తాయి? చంద్రబాబు హామీలిచ్చిన వారిలో కేబినెట్‌లో ఎవరు స్థానం దక్కించుకోగలరన్న అంశాలపై పలు అంచనాలు వినిపిస్తున్నాయి. మరోవైపు 12వ తేది చంద్రబాబుతో పాటే మంత్రివర్గ ప్రమాణ స్వీకారం కూడా ఉంటుందని సమాచారం. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వ రాజకీయ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన కాకుండా పాత జిల్లాల వారీగా మంత్రివర్గ ఎంపిక ఉంటుందని తెలిసింది. ఈ సారి బిసి, కమ్మ, కాపులకు ఐదు చొప్పున, రెడ్లకు మూడు నుంచి నాలుగు చొప్పున పదవులు దక్కే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఎస్‌సిలకు రెండు, ఎస్‌టి, మైనార్టీలకు చెరొక పదవి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. జనసేన నుండి కాపులకు ఎక్కువగా ప్రాతినిధ్యం లభిస్తుందని అంటున్నారు..ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి బిసి సామాజిక వర్గం నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్‌కు, ఎస్సి సామాజిక వర్గం నుంచి కొండ్రు మురళీమోహన్ పేర్లు వినపడుతున్నాయి. అచ్చెన్నాయుడు, రవికుమార్ తొలి నుంచి పార్టీ బలోపేతం కోసం పనిచేశారు. కొండ్రు మురళీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసి రాష్ట్ర విభజన అనంతరం టిడిపిలో చేరారు. విజయనగరం జిల్లా నుంచి కిమిడి కళా వెంకట్రావు, అదితి గజపతిరాజుకు దక్కవచ్చని తెలిసింది. ఎస్‌టి కోటాలో గుమ్మడి సంధ్యారాణికి ఇవ్వనున్నట్లు సమాచారం. విశాఖపట్నం నుంచి కాపు కోటాలో గంటా శ్రీనివాసరావు, బిసి కోటాలో చింతకాయల అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు పేర్లు వినిపిస్తున్నాయి. ఈ జిల్లా నుంచి ఎస్‌సి కోటాలో వంగలపూడి అనిత పేరు వినిపిస్తోంది. అనిత ప్రస్తుతం టిడిపి మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉన్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి బిసి కోటాలో యనమల రామకృష్ణుడు, కాపు కోటాలో నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, కమ్మ కోటాలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్లు వినిపిస్తున్నాయి. యనమలకు మంత్రి పదవి కచ్చితంగా ఉండనుంది. జనసేన నుంచి ఈ జిల్లాలో కాపు కోటాలో ఇస్తే చినరాజప్ప, నెహ్రూ ఉండకపోవచ్చనే చర్చ కూడా వినబడుతోంది. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కాపు కోటాలో నిమ్మల రామానాయుడు, క్షత్రియ కోటాలో రఘురామకృష్ణరాజు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కృష్ణా జిల్లాలో బిసి కోటాలో యాదవ సామాజిక వర్గం నుంచి కొలుసు పార్థసారధి, మత్స్యకార సామాజిక వర్గం నుండి కొల్లు రవీంద్ర పేర్లు వినిపిస్తున్నాయి. కాపు కోటాలో బొండా ఉమామహేశ్వరరావు, ఆర్యవైశ్య కోటాలో శ్రీరాం తాతయ్య, ఎస్‌సి కోటాలో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్లు పరిశీలనలో ఉన్నాయి. గుంటూరు జిల్లా నుంచి కమ్మ కోటాలో నారా లోకేష్, కాపు కోటాలో కన్నా లక్ష్మీనారాయణ, ఎస్‌సి కోటాలో తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనంద్ బాబు పేర్లు వినిపిస్తున్నాయి. గుంటూరు జిల్లా నుండి బిసి మహిళా కోటాలో గళ్లా మాధవి పేరు వినిపిస్తోంది. ప్రకాశం జిల్లా నుంచి కమ్మ కోటాలో ఏలూరు సాంబశివరావు, గొట్టిపాటి రవి, ఎస్‌సి కోటాలో డోలా బాలవీరాంజనేయస్వామి పేర్లు వినిపిస్తున్నాయి. నెల్లూరు నుంచి కాపు కోటాలో పి నారాయణ, రెడ్డి సామాజిక వర్గం నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కడప నుంచి రెడ్డప్పగారి మాధవిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కర్నూలు నుంచి మైనార్టీ కోటాలో ఎన్ఎండి ఫరూక్, ఆర్యవైశ్య నుంచి టిజి భరత్ పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం నుంచి కమ్మ కోటాలో పయ్యావుల కేశవ్, పరిటాల సునీత, రెడ్డి కోటాలో పల్లె సింధూర రెడ్డి, బిసి కోటాలో కాలువ శ్రీనివాసులు పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. చిత్తూరు నుంచి రెడ్డి కోటాలో ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

కింజరాపు అచ్చెన్నాయుడు

నిమ్మకాయల చినరాజప్ప,

నారా లోకేష్

వంగలపూడి అనిత

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

తిరుపతి అదనపు ఎస్‌పి బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి అదనపు ఎస్‌పి శివరామిరెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు డిజిపి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని అందులో పేర్కొన్నారు.

సారా ఉద్యమానికి రామోజీ రావు బాసటగా నిలిచారు

- ఐద్వా నాయకులు పుణ్యవతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ నాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు నాటి సారా వ్యతిరేక ఉద్యమానికి బాసటగా నిలిచారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు ఎస్ పుణ్యవతి గుర్తు చేశారు. ఆయన మృతి తెలుగు ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపారు. రామోజీరావు ఈనాడు పత్రిక ద్వారా ఆనాటి సారా ఉద్యమానికి ఎంతో మద్దతు ప్రకటించారని తెలిపారు. మహిళల కోసం తొలిసారిగా ఈనాడు పత్రికలో ప్రత్యేకించి వసుంధర పేజీని ప్రారంభించారని గుర్తు చేశారు. 1993లో విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం స్వర్ణోత్సవ సభలకు ముఖ్య అతిథిగా హాజరై మద్దతు ప్రకటించారని తెలిపారు.రామోజీ మరణం పట్ల ఐద్వా సీనియర్ నాయకులు టీ జ్యోతి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మీ తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.

కొండాపూర్ షోరూం పునఃప్రారంభం

- మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ఆభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తన కొండాపూర్‌లోని శాఖను అదే ప్రాంతంలో నూతనంగా ప్రారంభించారు. దీనిని శనివారం సినీనటీ పూనమ్ కౌర్, సంస్థ ఎండి యోగేష్ ముద్రాస్ లాంఛనంగా ప్రారంభించారు. విశాలమైన ప్రదేశంలో తీర్చిదిద్దిన నూతన షోరూం అంతర్జాతీయ వాతావరణాన్ని కల్పించడంతో పాటుగా ఇక్కడ అద్భుతమైన అభరణాలు అందుబాటులో ఉంటాయని ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు.

అక్షర యోధుడికి అశ్రునివాళి

ప్రజాశక్తి యంత్రాంగం :

పత్రికా రంగంపై చెరగని ముద్ర వేసిన రామోజీరావు మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, చంద్రబాబునాయుడు, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డితో సహా పలు రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

చెరగని ముద్ర వేసిన గొప్పవ్యక్తి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

"రామోజీరావు దూర దృష్టితో సమాజంలో చెరగని ముద్ర వేశారు. ఆయన మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. పత్రికా, టీవీ రంగంతో సహా అనేక సంస్థలు స్థాపించిన ఆయన ఎంతో మందికి మార్గదర్శకుడిగా నిలిచిన సృజనాత్మక వ్యాపారవేత్త. వివిధ రంగాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి" అని ఆమె పేర్కొన్నారు.

దేశాభివృద్ధి కోసం ఆలోచించారు: ప్రధాని మోడీ

"రామోజీరావు మరణం ఎంతో బాధాకరం. ఆయన ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించే వారు. ఆయన లేని లోటు దేశానికి తీరని నష్టం. భారతీయ సినీ, పత్రికా రంగాల్లో చెరగని ముద్ర వేశారు. పట్టుదల, కృషితో సినీ, మీడియా రంగంలో కొత్త ఆవిష్కరణలకు నాంది పలికి. నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఆయన నుంచి అపార జ్ఞానాన్ని పొందేందుకు అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి" అని ప్రధాని పేర్కొన్నారు.

మీడియా రూపురేఖలు మార్చారు : రాహుల్

భారత మీడియా రంగంలో అగ్రగామి రామోజీరావు మరణం విచారకరం.

ఆయన సేవలు చిరస్మరణీయం : తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్

రామోజీరావు మరణం తీవ్ర విచారకరం. మీడియా, జర్నలిజం, సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం.

సంతాపం తెలిపిన వారిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, అమిత్‌షా, కేరళ సిఎం పినరయి విజయన్, పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు ఉన్నారు.

పూడ్చలేని లోటు: తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

"రామోజీరావు లేని లోటు పూడ్చలేనిది. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన వ్యక్తిగా ఆయన చిరస్మరణీయులు. ఇటీవలే ఆయనతో భేటీ అయ్యాను. రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

అక్షర వీరుడు : కెసిఆర్

అక్షర వీరుడు రామోజీరావు. ఆయన తెలుగు పాత్రికేయ, సినీ రంగాలకు ఎనలేని సేవలు చేశారు. ఆయన మృతి తీరని లోటు. వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం.

శోక తప్తులైన ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి" అని కేసీఆర్ సంతాప సందేశంలో తెలిపారు.

పలువురి సంతాపం

తెలుగు మీడియా, సినీ రంగాలకు రామోజీ చేసిన సేవలు మరవ లేనివని పేర్కొంటూ పలువురు ప్రముఖులు తమ సంతాపాన్ని ప్రకటించారు.

తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పారు

తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడంలో తనదైన శైలిని సృష్టించుకున్న వ్యక్తి ఈనాడు గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు అని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రామోజీరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రబాబునాయుడు,

నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పి.మధు

తెలుగుకు వన్నె తెచ్చిన వ్యక్తి: చంద్రబాబు

"రామోజీరావు తెలుగుకు వెలుగులు నింపి వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి. సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించారు. ఆయన మరణం తీవ్ర ఆవేదనకు గురి చేసింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన కోలుకుంటారని భావించాను. కాని ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదు. ఆయన మరణం రాష్ట్రానికే కాదు దేశానికి కూడా తీరని లోటు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

సిపిఎం సంతాపం

ఈనాడు సంస్థలు, ప్రముఖ వ్యాపారవేత్త రామోజీరావు మరణం బాధాకరమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామోజీరావు తెలుగుమీడియా రంగానికి నూతన వరవడి దిద్దారని, పత్రికా విలువలు నిలబెట్టడంలో ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. సుందరయ్య, రాజేశ్వరరావు లాంటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకులను ఎంతో అభిమానించేవారని పేర్కొన్నారు. రామోజీరావు మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటని పేర్కొన్నారు. అలాగే ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి కూడా వేరొక ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

సామాన్యులకు సైతం పత్రికను దగ్గర చేశారు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విప్లవాత్మక నిర్ణయాలతో తెలుగు పత్రికారంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన దార్శనికుడు రామోజీరావు అని సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మధ్యాహ్నం రామోజీ ఫిల్మ్‌సిటీలో రామోజీరావు భౌతికకాయాన్ని సిపిఎం సీనియర్ నేత మధుతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాలు, నగరాలకే పత్రికలు పరిమితమైన రోజుల్లో...ఈనాడు పత్రికను స్థాపించి, గ్రామీణ ప్రాంత వార్తలకు ప్రాధాన్యమిస్తూ సరళమైన తెలుగుభాషలో సామాన్యులకు సైతం పత్రికను దగ్గరచేశారని తెలిపారు. సమాచార విప్లవంలో పెను మార్పుకు రామోజీరావు దోహదపడ్డారన్నారు. సామాజిక సేవలో ముందుండే తెలుగు ప్రముఖుల్లో రామోజీరావు ఆద్యుడని వి శ్రీనివాసరావు తెలిపారు. రామోజీరావు మృతికి సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పక్షాన ఆయన తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. రామోజీ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

తెలుగు మీడియాకు, దేశానికి తీరని లోటు : ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్

రామోజీరావు మృతికి ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన మరణం తెలుగు మీడియాకు, దేశానికి తీరని లోటని పేర్కొన్నారు.

రామోజీరావు మృతి సాహిత్యలోకానికి తీరనిలోటని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేయానంద్, కుర్ర రామారావు, సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెంగార మోహన్, కె.సత్యరంజన్, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐవి సుబ్బారావు, చందు జనార్ధన్ పేర్కొన్నారు.

నివాళులర్పిస్తున్న పవన్‌కల్యాణ్

రామోజీ ప్రస్థానం

కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 1936 నవంబర్ 16న చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. 1969లో రైతుల కోసం అన్నదాత పత్రికను ప్రారంభించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారు. రైతు బిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారు. హైదరాబాద్‌లో ఫిల్మ్‌సిటీని నిర్మించారు.

1995 ఆగస్టులో తెలుగు ప్రేక్షకుల కోసం ఈ-టివిని రామోజీరావు ప్రారంభించారు. తక్కువ సమయంలోనే జాతీయ స్థాయి నెట్‌వర్క్‌గా అది విస్తరించింది. ప్రతిక్షణం ప్రపంచ వీక్షణం పేరిట 13 భాషల్లో వార్తలు అందించారు. ఈ-టివి ప్లస్, ఈ-టివి సినిమా, ఈ-టివి అభిరుచి, ఈ-టివి లైఫ్, ఈ-టివి బాలభారత్ ఛానళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ-టివి వినోదాత్మక, విజ్ఞానదాయక కార్యక్రమాలు విశేష ప్రేక్షకాదరణపొందాయి. 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా వందల మంది గాయనీ గాయకులను సంగీత ప్రపంచానికి పరిచయం చేశారు. మట్టిలో మాణిక్యాలను ఎంతోమందిని వెలుగులోకి తీసుకొచ్చారు. ఉషా కిరణ్ మూవీస్ ద్వారా రామోజీరావు వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించారు. తెలుగు వంటకాల రుచులను ప్రపంచానికి పరిచయం చేసేలా 1980 ఫిబ్రవరిలో ప్రియా ఫుడ్స్‌ను ప్రారంభించారు. ఆహార ఉత్పత్తుల రంగంలో ప్రియా ఫుడ్స్‌కు అనేక రాష్ట్ర, జాతీయ పురస్కారాలు లభించాయి. రామోజీరావు సేవలకుగాను 2016లో భారత ప్రభుత్వం ఆయనను దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్‌తో సత్కరించింది.

టిడిపి కార్యాలయంలో నివాళి

టిడిపి కార్యాలయంలో రామోజీరావుకు నేతలు నివాళులర్పించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నక్కా ఆనంద్‌బాబు, బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పి అశోక్ బాబు, దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు కొండ్రు మురళి, దాట్ల సుబ్బరాజు, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, నాయకులు ఎవి రమణ, దారు నాయక్, దారపనేని నరేంద్రబాబు తదితరులు రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని ఈ సందర్భంగా నేతలు అన్నారు.

పదవులకు రాజీనామా చేసిన మల్లాది విష్ణు, గౌతమ్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోవడం, టిడిపి అధికారాన్ని కైవసం చేసుకోవడంతో నామినేటెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యులు రాజీనామాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో స్టేట్ ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ మల్లాది విష్ణు తన పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా ఏపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల

తెలంగాణ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అహంకారంతో ఉన్న మోడీ, కెసిఆర్, జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రజల ప్రేమను గెలుచుకోవాలేగాని అహంకారం చూపకూడదని, ప్రజలకు సేవచేస్తే ఆదరించి గెలిపిస్తారని పేర్కొన్నారు. ఇడి, సిబిఐలను వాడుకుని గెలవాలనుకున్న బిజెపికి ప్రజలు గుణపాఠం నేర్పారని అన్నారు. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో మేలు చేసే నాయకులను ప్రజలు ఎన్నుకున్నారని అన్నారు. శ్రీవారి దర్శించుకున్న ప్రముఖులకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఖైదీ మృతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రెడ్డిపల్లి సమీపంలో ఆదివారం ఖైదీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు లక్ష్మీపేటకు చెందిన ఉప్పర ఈరన్న(48) ఓ కేసులో శిక్ష పడి బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి సమీపంలోని అనంతపురం జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఆరు బయలు ఖైదీగా ఉంటూ సబ్‌జైలు ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంకులో పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం పెట్రోల్ బంకు వద్దకు వచ్చేందుకు జైలు ఎదురుగా ఉన్న రోడ్డును దాటుతుండగా రెడ్డిపల్లి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఈరన్న అక్కడికక్కడే మరణించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి రైతుల్లో ఆశల చిగురు

- ఊపందుకోనున్న రాజధాని పనులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో రాజధాని రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ఐదేళ్లపాటు అమరావతిని నిర్వీర్యం చేసింది. దీంతో, అమరావతికి భూమలిచ్చిన రైతులు పోరుబాట పట్టారు. తాజా ఎన్నికల్లో టిడిపి కూటమి సంపూర్ణ ఆధిక్యత రావడంతో రాజధాని గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి పనులు త్వరలో పునఃప్రారంభం అవుతాయని రైతులు భావిస్తున్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలెం గ్రామంలో 2015 అక్టోబరు 22న ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మిస్తామని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. అయితే, రాజధాని నిర్మాణానికి కేవలం రూ.1,500 కోట్లు కేటాయించి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకొంది. దాదాపు రూ.లక్ష కోట్ల అంచనాతో అప్పటి టిడిపి ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణానికి అప్పట్లో ప్రణాళికలు రూపొందించింది. ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. నవ నగరాలు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం హామీ అమలుకు నోచుకోలేదు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంతవరకూ దక్కలేదు. కాగితాల్లోనే ఈ ప్లాట్లు ఇచ్చారు తప్ప, అభివృద్ధి చేసి అప్పగించలేదు. సిఆర్‌డిఎ చట్టం ప్రకారం మొదటి మూడేళ్లలోనే రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించాల్సి ఉన్నా టిడిపి హయాంలో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చినా ఈ ప్రక్రియ కొనసాగించారని రైతులు భావించారు. అయితే, 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో సిఎం జగన్ మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని కోరుతూ రైతులు 1,630 రోజులపాటు సుదీర్ఘకాలం ఉద్యమించినా వైసిపి అధినేత జగన్ ఏ మాత్రమూ వెనక్కి తగ్గలేదు. తాను మళ్లీ అధికారంలోకొస్తే విశాఖలోనే ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు. దీంతో, రాజధాని రైతులు కొంత భయపడ్డారు. ఫలితాలు అనూహ్యంగా వచ్చాయి. టిడిపి కూటమి ఘన విజయం సాధించడంతో అమరావతి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాబోయే సిఎం చంద్రబాబు కేంద్రం నుంచి నిధులు తెచ్చి అమరావతిని అభివృద్ధి చేస్తారని రైతులు ఆశాభావంతో ఉన్నారు. ప్రధానంగా షరతులు లేకుండా భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల త్వరగా రావాలంటే ఎకరాకు కనీసం రూ.కోటి చొప్పున రూ.34 వేల కోట్లు కావాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత మొత్తం నిధులు కేంద్రం ఇస్తే తప్ప, అమరావతి అభివృద్ధి జరిగే పరిస్థితి లేదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అమరావతికి చంద్రబాబు నిధులు తెస్తారని రైతులు నమ్మకంతో ఉన్నారు. చంద్రబాబు దీన్ని నిలబెట్టుకుంటారో? లేదో? చూడాలి.

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ప్రొక్లెయినర్‌తో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు

టిడిపి దాడులపై హైకోర్టుకెళతాం

- మాజీ మంత్రి కొడాలి నాని

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

వైసిపి నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా టిడిపి, జనసేన కార్యకర్తలు చేస్తున్న దాడులపై హైకోర్టుకు వెళతామని మాజీ మంత్రి కొడాలి నాని తెలిపారు. దాడులు చేసిన వారితోపాటు పోలీసులపైనా కేసులు వేస్తామని చెప్పారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... వచ్చే రెండు రోజుల్లో కృష్ణా జిల్లాలో పర్యటిస్తామని, గాయపడిన కార్యకర్తలకు ధైర్యం చెబుతామని తెలిపారు. కార్యకర్తలను కాపాడుకుంటామని చెప్పారు. శాంతిభద్రతల సమస్య వస్తే పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల తర్వాత ఉద్దేశపూర్వకంగా వైసిపి నేతలను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి దాడులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రపతి, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. కళ్లెదుటే దాడులు జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. టిడిపి నుండి గెలిచిన ఎమ్మెల్యేలే ఈ దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బీహార్, యుపి మాదిరి ఏపిలో హింసా రాజ్యం రచిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు, ఆయన కుమారుడే ఇదంతా చేయిస్తున్నారని ఆరోపించారు. తమ ఇళ్లపైకి దాడులు చేస్తున్నా పోలీసులు కనీసం కేసు కూడా పెట్టడంలేదన్నారు. పోలీసు వ్యవస్థను చంద్రబాబు పతనావస్థకు తీసుకొచ్చారని ఆరోపించారు. టిడిపి రౌడీ మూకలు మహిళల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దాడులపై త్వరలో కృష్ణాజిల్లా ఎస్‌పిని తామంతా కలుస్తామని తెలిపారు.

రాయపూడికి సిఆర్‌డిఎ కార్యాలయం

- రాజధాని పరిధిలో ఆగిపోయిన భవనాల పటిష్టతపై తనిఖీలు
- వారంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలో ఉన్న సిఆర్‌డిఎ కార్యాలయాన్ని వీలైనంత త్వరగా రాయపూడిలో నిర్మాణంలో ఉన్న భవనంలోకి మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు సిఆర్‌డిఎ కమిషనర్‌కు ఆదేశాలు వెళ్లాయి. నిర్మాణంలో ఉండి ఆగిపోయిన భవనాల సామర్థ్యం, అక్కడ సామాగ్రికి సంబంధించిన అన్ని వివరాలూ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. 2018లో సీడ్ యాక్సిస్ రోడ్‌కు ఆనుకుని రాయపూడి వద్ద సిఆర్‌డిఎ కార్యాలయాన్ని నిర్మించారు. నాలుగు అంతస్తులు పూర్తి చేపట్టిన ఈ భవన నిర్మాణం ఆగిపోయింది. 2019 ఎన్నికల తరువాత ఆ భవనంలో చిన్న పని కూడా చేపట్టలేదు. ఇంటీరియర్ ఏర్పాటు చేస్తే వినియోగానికి వచ్చే భవనాన్ని అప్పట్లో వదిలేశారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ భవనాన్ని వెంటనే పూర్తి చేయడంతోపాటు దాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌గా మార్చాలని, అక్కడ నుండే కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో గ్రామాల్లో మినహా మిగిలిన ప్రాంతమంతా పిచ్చిమొక్కలు మొలిచి అడవిగా మారిన నేపథ్యంలో వాటిని క్లియర్ చేయడం పెద్ద పనిగా ఉంటుంది. పాత ప్లాను ప్రకారం నగరాన్ని సరిచేయాల్సి, ప్లాట్లు, లేఅవుట్లు, రోడ్లు తదితర వ్యవహారాలను కొలిక్కి తేవాలన్నా కనీసం ఆరునెలలపైగా పడుతుందని అంచనా వేశారు. ఈలోపే కనీసం సిఆర్‌డిఎ కార్యాలయం తరలించడంతోపాటు వీలైనన్ని ప్రభుత్వ కార్యాలయాలను కూడా అక్కడ నిర్మాణంలో ఉన్న భవనాల్లోకి తరలించాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో సిఆర్‌డిఎ అధికారులు ఆగమేఘాల మీద రాజధాని పరిధిలో కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. తొలుత పిచ్చిమొక్కలను తొలగించడంతోపాటు వీలైనంత తొందరగా రాజధానిలో సిఆర్‌డిఎ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం, అక్కడ నుండే పనులను పర్యవేక్షించడం వంటివి చేపట్టాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా శనివారం సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్‌యాదవ్ నిర్మాణం నిలిచిపోయిన అన్ని భవనాలనూ పరిశీలించారు. ముళ్ల కంప పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఇప్పటికే సుమారు 100 జెసిబి యంత్రాలను దిగుమతి చేసుకున్నారని, 76 వరకూ పనిలో ఉన్నాయని తెలిపారు. వీలైనంత తొందరగా సిఆర్‌డిఎ భవనాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నేడు ఎపి లాసెట్-2024 పరీక్ష

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎపి లాసెట్, ఎపి పిజి లాసెట్-2024 పరీక్షను ఆదివారం నిర్వహించనున్న లాసెట్ చైర్మన్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు వర్సిటీలో వారు శనివారం మీడియాతో మాట్లాడుతూ మూడేళ్ల ఎల్‌ఎల్‌బి, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బి, రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామన్నారు. పరీక్షలో సాధించిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల్లోని లా కళాశాలలు, ప్రయివేటు లా కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారని చెప్పారు. మూడు విభాగాల కోర్సులకు 23,425 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో పురుషులు 15,374 కాగా మహిళలు 8,051 ఉన్నారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుండి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు డౌన్లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తోపాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వాటిల్లో ఏదోఒక గుర్తింపును తప్పనిసరిగా తెచ్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను మధ్యాహ్నం ఒంటి గంట నుండి 2.30 గంటల వరకూ అనుమతిస్తామని తెలిపారు. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

'బర్డ్'లో రోగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి నగరంలోని బర్డ్ ఆస్పత్రిలో 110 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇటీవల తమిళనాడు ధర్మపురికి చెందిన దాత సుబ్రమణియన్ బర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆధునీకరణకు రూ.కోటి విరాళంగా అందించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యుకె సాంకేతిక సహకారంతో ఎండోలైట్ కంపెనీ వారు అత్యాధునిక సాంకేతిక సహకారంతో తయారు చేసిన ఎక్కువ మన్నిక గల కృత్రిమ అవయవాలను ఉచితంగా అందించారు. బర్డ్ ఆస్పత్రి చేస్తున్న సేవలకుగాను ఎండోలైట్ కంపెనీ వారు అసలు ధరలో 50 శాతం రాయితీతో అల్యూమినియంతో తయారు చేసిన ఈ కృత్రిమ అవయవాలను టిటిడికి అందించారు. వీటిని ధరించిన రోగులు సాధారణ వ్యక్తుల్లాగే అత్యంత సులభంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా నడవగలుగుతుమని రోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్డ్ ఆస్పత్రి వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది, రోగుల బంధువులు పాల్గొన్నారు.

PIRAMAL CAPITAL & HOUSING FINANCE LTD
Piramal Capital & Housing Finance
CIN:L65910MH1984PLC032639
Registered office :Unit No.601,6th Floor,Amiti Building,Agastya corporate park, Kamani Junction, Opp:fire station,LBS Marg, Kurla(West), Mumbai -400 070 T+91 22 3802 4000, www.piramalfinance.com

అనుబంధం-4 స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **పిరమల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (పిసిహెచ్‌ఎఫ్‌ఎల్)** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, కంపెనీ యొక్క అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను జారీచేసి, ఇందు దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/హామీదారులను సదరు నోటీసు స్వీకరించిన 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు/హామీదారులు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనం చేసుకున్నారు.**
ది సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, షార్ఫసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించగలరు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలతో లావాదేవీలు జరుపుట అనునది, **పిరమల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** కు దానిపై వడ్డీతో ఇందు దిగువ పేర్కొన్న మొత్తాలను చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీతలు/ హామీదారుల పేరు	సెక్యూర్డ్ అసెట్ (స్థిరాస్తి) వివరణ	డిమాండ్ నోటీసు తేది & మొత్తాలు	స్వాధీనతా తేది
1	Uni Code:- M0167793 బ్రాంచి పేరు: విజయవాడ **రత్నకుమార్ దేవతోటి, ఆస్తి చిరునామా:** డోర్ నం.37-5/1-8 దగ్గర, ఎన్.టి.ఎస్.నం.33, వార్డు నం.11, బ్లాక్ నం.2, లబ్బీపేట, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, బదవ పేట, కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర.-520010. **రత్నకుమార్ దేవతోటి, నివాస చిరునామా:** ఫ్లాట్ నం.401, ఈశ్వర రెసిడెన్సీ, రైతే బజార్ దగ్గర, దసనపేట, విజయనగరం, ఆం.ప్ర. ఇండియా-535004. **రత్నకుమార్ దేవతోటి, ఆఫీసు చిరునామా:** మెసర్స్ హొటల్ ప్రియ ప్రహర్షిని, ఫ్లాట్ నం.7, సింగపూర్ సిటీ, దసనపేట, ఎంసి బిట్ గ్రామం, విజయనగరం, ఆం.ప్ర.-535002. **హుల్ద దేవతోట,** ఈశ్వర రెసిడెన్సీ, రైతే బజార్ దగ్గర, దసనపేట, విజయనగరం, ఆం.ప్ర. ఇండియా-535004.	బదవపేట, లబ్బీపేట, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, బదవపేట, ఎస్‌ఆర్‌ఓ పటమట, కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర.-520010 వద్ద బ్లాక్ నం.2, వార్డు నం.11, ఎన్.టి.ఎస్.నం.33, డోర్ నం. 37-5/1-8 దగ్గర, 51.28చ. గలు లేదా 42.87చ.మీ.ల విస్తీర్ణంలో నిర్మించిన ఒక పాత ఆర్‌సిసి రూఫ్డ్ భవనము గల ఆస్తి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు, పడమర: వేములపల్లి సురేశ్ కుమార్ ఆస్తి, తూర్పు: వేములపల్లి రాజ కుమార్ ఆస్తి, దక్షిణం: వేపూరి గోపాల్ రావు ఆస్తి.	20 ఫిబ్రవరి 2024 & రూ. 23,18,439/-	05-Jun-2024

ప్రదేశం: విజయవాడ, తేది: 08.06.2024 సం/- అధీకృత అధికారి, పిరమల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

తెలుగు సినిమాపై 'రామోజీ' ముద్ర

నివాళులర్పిస్తున్న చిరంజీవి

తెలుగు సినిమా పరిశ్రమపై రామోజీరావు ముద్ర ఎంతో ఉంది. మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు పరిశ్రమ రావటానికి ఆయన ఎంతో కృషిచేశారు. ఉషా కిరణ్ మూవీస్ బ్యానర్, మయూరి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్‌ని ప్రారంభించి కొన్ని వందల తెలుగు చిత్రాలనే కాకుండా, ఇతర భాషా చిత్రాలు కూడా పంపిణీ చేశారు. షూటింగులకు అత్యంత అనువైన రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించారు. సినిమా అనేది కళాత్మక వ్యాపారం అని నమ్మిన వ్యక్తాయన. అశ్లీలతకు దూరంగా మంచి వినోదాత్మక, సందేశాత్మక కథ చిత్రాలను నిర్మించాలన్న సంకల్పంతో ఉషా కిరణ్ మూవీస్ సంస్థను ఏర్పాటుచేశారు. తన తుదిశ్వాస వరకు అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు. విలువలున్న చిత్రాలను అందించాలన్న ఆలోచనతో ఏర్పాటు చేసిన ఉషాకిరణ్ మూవీస్ ద్వారా.. తారాబలం కాకుండా కేవలం కథను మాత్రమే విశ్వసించి 85కుపైగా చిత్రాలను నిర్మించారు. ఉషాకిరణ్ మూవీస్‌లో అవకాశమంటే మార్కెట్‌లో క్రేజ్ ఉన్న ఏ కథనాయకుడైనా టక్కున కాల్షీట్లు ఇచ్చేవారు. కానీ రామోజీరావు మాత్రం తారలను సృష్టించే కథలను నమ్మారు. అలా 1984లో దిగ్గజ హాస్య దర్శకుడు జంధ్యాల దర్శకత్వంలో తెలుగు చిత్ర పరిశ్రమలో అప్పుడే ఎదిగే ప్రయత్నం చేస్తున్న.. నరేష్, పూర్ణిమతో శ్రీవారికి ప్రేమలేఖని నిర్మించారు. ఆ చిత్రం ఘనవిజయం సాధించడంతో మొదటి చిత్రం తోనే తెలుగు సినిమాతోనే తనదైన ముద్ర వేశారు. కథలనేవి కల్పనల్లోంచి కాదు, జీవితాల్లోంచి పుడతాయని ఉషా కిరణ్ మూవీస్ సంస్థ నిరూపించింది. అందుకు ఉదాహరణే మయూరి సినిమా. ఒక హిందీ పత్రికలో వచ్చిన వార్తను సినిమాగా మలిచి సంచలనం సృష్టించారు. ప్రమాదంలో కాలు పోగొట్టుకొని, కృత్రిమ పాదంతో నాట్యంలో రాణించిన సుధా చంద్రన్ జీవితాన్ని తెరపై ఆవిష్కరించి ఘనవిజయాన్ని సొంతం చేసుకున్నారు. మయూరి చిత్రంతోనే జైపూర్ పాదం గురించి దేశంవ్యాప్తంగా ప్రజలకు తెలిసింది. ఒడిశాలో జరిగిన యధార్థ సంఘటనలతో మౌనపోరాటం, జాతీయ క్రీడాకారిణి అశ్వని నాచప్ప బయోపిక్ అశ్వని.. వంటి చిత్రాలను నిర్మించి ఆయన అభిరుచి వేరు అని నిరూపించుకున్నారు. కాంచన గంగ, ప్రతిఘటన, నువ్వేకావాలి, చిత్రం, ఆనందం, నచ్చావులేవంటి ఎన్నో హిట్ చిత్రాలను నిర్మించారు. కేవలం తెలుగు చిత్రాలకే ఉషా కిరణ్ మూవీస్ పరిమితం కాలేదు. కన్నడ, తమిళ, మరాఠీ, ఆంగ్ల భాషల్లో ఇప్పటివరకు 85 చిత్రాలను నిర్మించింది. శ్రీవారి ప్రేమలేఖకు ప్రభుత్వ పురస్కారాలు వరించాయి. కాంచన గంగ, మయూరి, ప్రతిఘటన, తేజ, మౌనపోరాటం లాంటి చిత్రాలకు నంది అవార్డులు లభించాయి. మయూరిలో నటించిన సుధా చంద్రన్‌కు ఏకంగా జాతీయస్థాయిలో పురస్కారం దక్కింది. నువ్వే కావాలికి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ అవార్డు లభించింది. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా ప్రేక్షకులకు చేరువైన నటులు ఎంతో మంది ఉన్నారు. శ్రీకాంత్, వినోద్ కుమార్, చరణ్ రాజ్, యమున, జూ. ఎన్టీఆర్, ఉదయ్ కిరణ్, తరుణ్, కల్యాణ్ రామ్, రీమాసేన్ , శ్రియ, జెనీలియా, తనీశ్ ఇలా ఎందరో నటులు పరిచమయ్యారు. మౌనపోరాటంతో గాయని ఎస్. జానకిని సంగీత దర్శకురాలని చేశారు. గాయకులు మల్లికార్జున్ , ఉష, గోపికా పూర్ణిమ లాంటి వారిని శ్రోతలకు పరిచయం చేశారు.

నేడు షూటింగులు బంద్

రామోజీరావు మరణవార్త తెలుగు చిత్ర పరిశ్రమను తీవ్రంగా కలచివేసింది. ఆయన మృతికి సంతాప సూచకంగా ఆదివారం చిత్ర పరిశ్రమ బంద్‌కు పిలుపునిచ్చినట్లు చలనచిత్ర నిర్మాతల మండలి ప్రకటించింది. షూటింగులను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. మరోవైపు పలువురు సినీ ప్రముఖులు రామోజీరావుకు నివాళులర్పించారు. చిరంజీవి, పవన్ కళ్యాణ్, మోహన్‌బాబు, నాగార్జున, అల్లు అర్జున్, ఎన్‌టిఆర్, రాఘవేంద్రరావు, రాజమౌళి, కీరవాణి, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, నరేష్, కల్యాణ్‌రామ్, సాయికుమార్ తదితరులు నివాళులర్పించారు. ఎపి చలనచిత్ర వాణిజ్యమండలి ప్రతినిధులు ఎఎం రత్నం, జెవి మోహన్‌గౌడ్ సంతాపాన్ని ప్రకటించారు.

'గేమ్‌ఛేంజర్' యూనిట్ నివాళి

రాజమండ్రిలో చిత్రీకరణ జరుపుకొంటున్న 'గేమ్ ఛేంజర్' చిత్ర బృందం సెట్లో నివాళులర్పించింది. హీరో రామ్ చరణ్, దర్శకులు శంకర్, నటులు సునీల్ రఘు కారుమంచి, ఇతర చిత్ర బృంద సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
ORIX
(గతంలో ఓఎఐఎస్ ఆటో ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా తెలిసినది)
(ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క సబ్సిడరీ)
రిజిస్టర్డు ఆఫీసు: ప్లాట్ నెం.94, మారోల్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్, అంధేరి-కూర్ల రోడ్, అంధేరి (ఇ), ముంబయి-400059.
Tel.: + 91 22 2859 5093 / 6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937

స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటి ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారుడు **ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్‌సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు తేదీ నుండి 60రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న బాకీమొత్తాలు చెల్లింపు/రియలైజేషన్ తేదివరకు డిమాండ్ నోటీసు తేది నుండితదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలతోకలిపి **రూ.1,45,52,829.95/- (రూపాయలు ఒకకోటి నలభైఐదులక్షల యాభైరెండువేల ఎనిమిదివందల ఇరవైతొమ్మిది & తొంభైఐదుపైసలు మాత్రమే)**లను తిరిగిచెల్లించమని రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/ తాకట్టుదారులుగా **కాంద్రు సత్యనారాయణ, కాంద్రు శంకర రావు, వెంకట నాగ మల్లేశ్వర రావు కాంద్రు మరియు మెసర్స్ నాగ సింధు స్పిన్నింగ్ మరియు జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్** వారిని కోరుతూ **తేది.19.03.2014**నాటి డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

1) రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు సదరు నోటీసు పంపబడినప్పటికిని తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలతోసహా పూర్తి నోటీసు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినందున, ఇందుమూలంగా ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్కరూల్ 9తో చవదగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **04 జూన్, 2024**న లాంఛనప్రాయంగా స్వాధీనంలోకి తీసుకోవడమైనది.
2) ప్రధానంగా రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలను జరపదలచిన వారు **ఓరిక్స్ లీజింగ్&ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్** వారికి బాకీ మొత్తాలు చెల్లింపు/ రియలైజేషన్ తేది వరకు డిమాండ్‌నోటీసు తేది నుండి తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలతోకలిపి **రూ.1,45,52,829.95/- (రూపాయలు ఒకకోటి నలభైఐదులక్షల యాభైరెండువేల ఎనిమిదివందల ఇరవైతొమ్మిది & తొంభైఐదుపైసలు మాత్రమే)** లను చెల్లించుటకు లోబడి ఉంటుంది.

ఆస్తి వివరణ:
మంగళగిరి, మంగళగిరి మునిసిపల్ ఏరియా, మంగళగిరి సబ్-రిజిస్ట్రార్, గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్-522503 లోని డోర్ నెం.5-768, మున్సిపల్ వార్డు నెం.5, మంగళగిరి యొక్క డోర్ నెం.195/బి1 లోగల అన్ని ఈస్‌మెంట్ హక్కులతో ఆర్‌సిసి రూఫ్ట్ గ్రౌండ్, 1వ మరియు 2వ అంతస్తు నివాసిత బిల్డింగ్ తోసహా నివాసిత సైట్ యొక్క 243చ.గ.లు లేదా 204.12చ.మీ.ల విస్తీర్ణపు ఆస్తి మొత్తం భాగం మరియు సరిహద్దులుగా: తూర్పు: అందె ఈశ్వరరావు ఆస్తి, పడమర: బట్టు వీరరాఘవయ్య ఆస్తి, ఉత్తరం: మునిసిపల్ బజార్, దక్షిణం: కాంద్రు సత్యనారాయణ ఆస్తి

తేది: 04-06-2024
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
రుణ ఖాతా నెం: LN0000000011826

వీ విధేయులు,
అధీకృత అధికారి
ఓరిక్స్ లీజింగ్ &
ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

ఉద్యోగులకూ జీరో సర్వీసెస్ బదిలీలు?

- 20 తర్వాత ఉండొచ్చని ప్రచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐఎఎస్, ఐపిఎస్ ఉద్యోగుల తరహాలో సాధారణ ఉద్యోగులకు కూడా జీరో సర్వీసెస్‌తో బదిలీల ప్రక్రియ చేపట్టే దిశగా చంద్రబాబు నేతృత్వంలో నూతన ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈనెల 12న చంద్రబాబు నేతృత్వంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం కొలువు తీరనుంది. ఈ నెల 20 తరువాత బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిసింది. జీరో సర్వీసెస్ పద్ధతిలో తహసీల్దార్ కంటే ఎగువనున్న అధికారుల పోస్టులు పాలనాపరంగా ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు బదిలీ చేసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. అటెండర్ నుంచి తహసీల్దార్ స్థాయి కేడర్ గల ఉద్యోగులకు సర్వీసెస్ రూల్స్ ప్రకారం ఏటా 20 శాతం మించకుండా బదిలీలు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంది. కానీ కొంతకాలంగా అది అమలు జరగడం లేదు. నూతన ప్రభుత్వం ఏర్పడుతున్న నేపథ్యంలో ఎంతో కాలంగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు సర్వీసెస్ రూల్స్‌కు మినహాయింపునిస్తే ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల సానుకూల ధోరణి ఏర్పడుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్లను ఐదునెలల క్రితం ఒక జిల్లా వారిని మరొక జిల్లాకు కేటాయించారు. దీంతో గత ఐదు నెలలుగా ఆయా ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను వారిని పూర్వపు జిల్లాలకు బదిలీలు చేయాలని ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధి బృందం శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల టీచర్స్ బదిలీలకు సంబంధించిన ఫైల్‌పై ఆరోపణలు రావడంతో ఆయా బదిలీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. నూతన ప్రభుత్వం జీరో సర్వీసెస్ బదిలీలు అమలుచేస్తే రెవెన్యూ, పోలీస్, టీచర్లతోపాటు గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులతోపాటు దిగువస్థాయి కేడర్‌లో పనిచేసే ఉద్యోగులకు పెద్ద ఎత్తున ఊరట లభిస్తుందని ఉద్యోగ సంఘాల్లో చర్చ నడుస్తోంది.

జీరో సర్వీసెస్ అంటే

జీరో సర్వీసెస్ అంటే ఎంతకాలం నుండి పనిచేస్తున్నారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏ స్థాయిలో పనిచేసే ఉద్యోగినైనా బదిలీ చేయొచ్చు. ప్రభుత్వంలో ఐఎఎస్, ఐపిఎస్‌లను ఎప్పుడైనా బదిలీ చేసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. కిందిస్థాయి ఉద్యోగులకు కొన్ని నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఏడాదికి 20 శాతానికి మించి సిబ్బందిని బదిలీ చేయకూడదు.

వర్మ వర్సెస్ జనసేన

- పిఠాపురంలో రాజుకున్న అగ్గి

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గెలుపొందిన పిఠాపురంలో రాజకీయాలు ఆసక్తిగా మారాయి. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో శుక్రవారం రాత్రి టిడిపి మాజీ ఎమ్మెల్యే వర్మపై దాడితో టిడిపి, జనసేన మధ్య గ్రూపు విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన వర్సెస్ టిడిపి ఇన్‌ఛార్జ్ వర్మ అన్నట్టుగా వ్యవహారం ముదురుతోంది. ప్రభుత్వం ఏర్పడక ముందే, ఎంఎల్‌ఎలు బాధ్యతలు స్వీకరించక ముందే సోషల్ మీడియా వేదికగా ఇరు శిబిరాలు చేస్తున్న విమర్శ, ప్రతి విమర్శల నేపథ్యంలో మిత్రపక్ష నేతల మధ్య తగాదా ఏ పరిణామాలకు దారి తీయనుందోననే చర్చ జరుగుతోంది.

ఎన్నికల ముందు నుంచే..

రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి, జనసేన పొత్తుతో బరిలో దిగాయి. పిఠాపురం నుంచి టిడిపి సీటును మాజీ ఎమ్మెల్యే వర్మ ఆశించారు. ఇక్కడ నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ బరిలో దిగుతున్నట్టు ప్రకటించడంతో వర్మ శిబిరం తీవ్రంగా వ్యతిరేకించింది.

చివరకు చంద్రబాబు జోక్యంతో వర్మ మెత్తబడి పవన్ కల్యాణ్‌కు మద్దతు తెలిపారు. పవన్ కల్యాణ్ తన గెలుపు బాధ్యతను వర్మ చేతుల్లో పెడుతున్నట్టు ప్రకటించారు. పవన్ కల్యాణ్ 70 వేలకుపైగా మెజార్టీతో విజయం సాధించారు. అయితే, ఆశించిన విధంగా లక్షకుపైగా ఓట్ల మెజార్టీ రాకపోవడానికి వర్మే కారణమంటూ కౌంటింగ్ అనంతరం జనసేన నాయకులు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో శుక్రవారం రాత్రి వర్మపై దాడి జరిగింది. కాకినాడ ఎంపి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ అనుచరులే తనపై దాడి చేశారని ఆయన ఆరోపించారు. దీంతో, జనసేన భగ్గుమంటోంది. ఎన్నికలకు ముందే సమన్వయ సమావేశం సందర్భంగా నేరుగా వర్మ, ఉదయ్ శ్రీనివాస్ మధ్య మాటలు యుద్ధం జరిగింది. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు.

రిజిస్టర్డు
నం. ఐటిబిపి/26వ బటాలియన్/ఈస్ట్-2/సిఓఐ(సిటి/జిడి సాదుపేట్ మురళి)/2024-1305
కమాండెంట్ వారి కార్యాలయం, 26వ బటాలియన్,
ఇండొ టిబెటిన్ బార్డర్ పోలీస్ ఫోర్స్, ఎంహెచ్‌ఏ (భారత ప్రభుత్వం)
పోస్టు ఆఫీసు: బద్దోవాల్, జిల్లా: లుధియానా (పంజాబ్)
ఇ-మెయిల్ : itcell26thbn@itbp.gov.in

ప్రకటన తేది: 01.06.2024

రెజిమెంటల్ నం. 170070194 కానిస్టేబుల్/ జిడి సాదుపేట్ మురళి, 'డి' కాయ్, 26వ బటాలియన్ ఐటిబిపి తండ్రి శ్రీ ఎస్. వెంకట కోటయ్య, శాశ్వత చిరునామా: గ్రామం- వీరరాఘవపేట, పోస్టు-ఆఫీసు: చీరాల, పి/ఎస్& తెహసిల్: చీరాల, జిల్లా: ప్రకాశం (ఆం.ప్ర), పిన్-523155 అనువారికి ఇందుమూలంగా తెలియజేయబుచున్నది ఏమనగా, మీరు 30 రోజుల కొరకు ఎర్నింగ్ లీవ్ పై 03.01.2024 నుండి 01.02.2024 వరకుగల సెలవుపై వెళ్లారు. సెలవులు ముగిసి తరువాత, మీరు సదరు తేదీన విధులకు హాజరవతారని మేము భావించాము కాని 02.02.2024 (మ॥) నుండి కూడా సంబంధిత అధికారుల ఏదేని ముందస్తు అనుమతి తీసుకోకుండానే, వరుసగా సెలవుపై కొనసాగుతున్నారు. ఈ ఆఫీసు రిజిస్టర్డు/ స్పీడ్ పోస్టు లేఖ నం.291 తేది: 08.02.2024, 342 తేది: 14.02.2024, 441 తేది: 27.02.2024, 466 తేది: 02.03.2024 & 1023 తేది: 26.04.2024 ఆధారంగా, 26వ బటాలియన్ ఐ.టి.బి.పి. బద్దోవాల్, లుధియానా (పంజాబ్) వద్ద వెంటనే రిపోర్టుచేయవలసిందిగా ఆదేశించారు, కాని మీరు సదరు తేదీ వరకు రిపోర్టుచేయుటలో విఫలం చెందారు. ఐటిబిపిఎఫ్ చట్టం-1992 యొక్క సెక్షన్ 72 & 73 క్రింద కలిగియున్న నియమాల ప్రకారం, అప్రిహెన్షన్ రోల్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా-ప్రకాశం (ఆం.ప్ర) వారికి ఈ ఆఫీసు లేఖ నం.467 తేది: 01.03.2024 ఆధారంగా మిమ్ములను కనుగోనవలసిందిగా కోరుతూ జారీచేయబడినది మరియు కమాండెంట్, 26వ బటాలియన్, ఐ.టి.బి.పోలీస్‌కు అప్పగించుట జరిగింది, కాని పోలీస్ అధికారులకు మీరు అగుపించలేదు.

2. తేది: 02.02.2024 (మ॥) నుండి మీ వరుస గైర్హాజరు కారణంగా, కోర్టు విచారణ (సిఓఐ)ను ఐటిబిపిఎస్ చట్టం-1992 యొక్క సెక్షన్ 74(1) యొక్క నియమాలలో తేది: 14.03.2024 నాటి ఆర్డర్ నం.561 ఆధారంగా, మీ సుధీర్ఘ గైర్హాజరు యొక్క పరిస్థితులను విచారించుటకు మరియు సిఓఐ యొక్క పరిశోధనలు మరియు సిఫారసులు ప్రాతిపదికన, ఐటిబిపిఎఫ్ యాక్ట్-1992 యొక్క సెక్షన్ 74(2) యొక్క నియమాలలో ఈ ఆఫీసు ఆర్డర్ నం.909 తేది: 18.04.2024 ఆధారంగా 02.02.2024 నుండి వర్తిస్తూ మిమ్ములను "డిసెర్టర్"గా ప్రకటించుట జరిగింది. డిసెర్టర్ ఆర్డర్ యొక్క ఒక కాపీని మీ ఇంటి చిరునామాకు రిజిస్టర్డు లెటర్ ద్వారా కూడి పంపబడినది. పై వాటికి అదనంగా, ఈ ఆఫీసు లెటర్ నం. 1204 తేది: 01.06.2024 ఆధారంగా "సోకాజ్ నోటీసు"ను కూడా మీకు జారీచేయబడినది.

3. రెజిమెంటల్ నం.170070194 కానిస్టేబుల్ (జిడి) సాదుపాటి మురళి, 'డి' కాయ్, 26వ బటాలియన్, ఐటిబిపి, తండ్రి శ్రీ ఎస్. వెంకట కోటయ్యను ఇందుమూలంగా తిరిగి ఆదేశించునది ఏమనగా, మీరు దినపత్రికలో ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 30 రోజుల్లోగా, తప్పనిసరిగా 26వ బటాలియన్ ఐటిబిపి, బద్దోవల్, లుధియానా (పంజాబ్) వద్ద విధులకు రిపోర్టుచేయగలరు లేదా మీ ప్రతివాదనలపై పత్రాలను సమర్పించవచ్చును, విఫలం చెందిన ఏదైతే, మీరు ఏమీ చెప్పదలచలేని వారుగా భావించబడి, ఆ తరువాత, అవసరమైన ఆదేశాలు జారీచేయబడుతాయి.

CBC 19112/11/0069/2425

కమాండెంట్,
26వ బటాలియన్ ఐ.టి.బి. పోలీస్.

సంపాదకీయం

పుస్తకాల బరువు కాదు... మేధస్సు పెరగాలి!

రాష్ట్రంలో 50 రోజుల వేసవి సెలవుల తర్వాత స్కూళు జూన్ 12న పున:ప్రారంభం కానున్నాయి. ఒకప్పుడు వేసవి సెలవులంటే...పిల్లలకు ఎన్నో మధురమైన జ్ఞాపకాలుండేవి. అమ్మమ్మ, నానమ్మ ఊళ్లకు వెళ్లి...ఆట పాటలతో సరదా సరదాగా గడిచిపోయేది. ఇప్పటి పిల్లలకు అలాంటి సరదాలు లేవు. 24 గంటల్లో నిద్రపోయే ఆ కాస్త సమయం తప్ప మిగతా సమయమంతా టీవీలు, మొబైల్ ఫోన్లు, ఐపాడ్‌లకు అతుక్కుపోతున్నారు. అద్భుతంగా గడపాల్సిన బాల్యం యాంత్రికంగా మారిపోయింది. పదవ తరగతి, ఇంటర్ చదివే పిల్లల పరిస్థితి చూస్తే జాలేస్తుంది. ఇల్లు, కోచింగ్ సెంటర్లు తప్ప మరో ధ్యాస వుండదు. విద్య కార్పొరేటీకరణ అయిన తర్వాత ఈ ధోరణులు బాగా పెరిగిపోయాయి. దీంతో వేసవి సెలవుల ఉద్దేశమే దెబ్బతింటోంది. ఇలా వుంటే పిల్లల్లో సాంఘిక జీవనం ఎలా పెంపొందుతుంది? మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం ఎలా పెరుగుతుంది? ఆటపాటలు, పత్రికలు, నీతికథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదివించడం, నృత్యం, చిత్రలేఖనం, సంగీతం, స్విమ్మింగ్ వంటి వాటిల్లో పిల్లల అభిరుచులను బట్టి ప్రోత్సహించడం తల్లిదండ్రులు లేదా సంరక్షకుల బాధ్యత.

'మనిషి జీవితానికి వెలుగునిచ్చి, మనోవికాసానికి తోడ్పాటునిచ్చేది విద్య మాత్రమే' అంటారు స్వామి వివేకానంద. నేడు ఇందుకు భిన్నంగా జరుగుతోంది. భుజాలు ఒంగిపోయేలా పుస్తకాల బ్యాగ్‌లతో కిక్కిరిసిన ఆటోలోనో, బస్సులోనో ప్రయాణం- ఇలా ఉరుకులు పరుగులతో జీవితం సాగిపోతోంది. పదేళ్లు కూడా నిండని పిల్లలు 8 నుంచి 10 కిలోలకు పైగా బరువున్న పుస్తకాల బ్యాగ్‌లు మోయాల్సి వస్తోంది. అమ్మకి ఇష్టమైన సబ్జెక్టు అనో, నాన్నకి నచ్చిన సబ్జెక్ట్ అనో తమకు ఇష్టమున్నా లేకున్నా బట్టీ పట్టాల్సిందే. ఒకటో తరగతి చదువుతున్న బుడ్డోడి స్కూల్ బ్యాగ్ బరువు 8 కిలోలు. ఉదయం, సాయంత్రం ఆ బాగ్ మోయడానికి వాళ్ల అమ్మ రావాల్సిందే. పదో తరగతి పిల్లల బ్యాగ్‌లైతే 10 నుంచి 12 కిలోలు. ఈ బరువులు మోయలేక చిన్నారి వెన్నెముకలు వంగిపోతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇవన్నీ ఒక ఎత్తయితే... మోయలేని ఫీజుల భారంతో చిన్న జీవితాలు చితికిపోతున్నాయి. ఇంకా చిత్రం ఏంటంటే...టెన్త్ చదువుతున్న కూతురు 'టీచర్ అవుతాను' అంటే-'మన హోదాకు టీచర్ కావడం ఏంటి?' అని ఎంపీసీలో చేర్పించారు. ఆ అమ్మాయి ఆ లెక్కలు చెయ్యలేక తల్లిదండ్రులకు చెప్పలేక కుమిలిపోయింది. దీనికి బాధ్యులెవరు? పిల్లలపై తమ అభీష్టాలను రుద్ది, వారిని తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురిచేయడం కన్నా వారికి నచ్చిన సబ్జెక్టునే తీసుకునేలా చూడటం మంచిది. 'తాము సాధించలేని లక్ష్యాలను సాధించే 'పనిముట్లు'గానో, తమ వారసత్వాన్ని కొనసాగించే 'సొత్తు'గానో తల్లిదండ్రులు భావిస్తున్నారా... అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి' అంటారు పద్మశ్రీ ప్రొఫెసర్ శాంతాసిన్హా. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే ప్రశ్న ఇది.

జీవితం ఒక సజీవ స్రవంతి. దాని ప్రవాహం సర్వదా ముందుకే. అది అంతకంతకూ విశాలమౌతుండాలి. అంతకంతకూ పరిణతి చెందాలి. కానీ, కార్పొరేట్ సంస్కృతి పుణ్యమా అని విద్యాసంస్థల్లో పేద, ధనిక అంతరాలు పెరిగిపోతున్నాయి. విద్యా, వైద్యం అందని ద్రాక్షలా మారింది. పేదలకు ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వాలు- కార్పొరేట్ సంస్థల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తున్నాయి. బాల పొంగు- పాల పొంగు అన్నారు. ఆ పొంగు వృధా పోకుండా దేశానికి జీవనాడి కావాలంటే... విద్యా, వైద్య వ్యవస్థల్లో సమూల మార్పులు రావాలి. ఈ రెండు వ్యవస్థలు ప్రభుత్వాధీనంలో నడవాలి. పిల్లల భుజాలపై పుస్తకాల బరువును కాదు... వారి మేధస్సును పెంచే విద్యావిధానం కావాలి. పిల్లలను వ్యక్తులుగాను, సంఘజీవులుగానూ తీర్చిదిద్దాలి. ప్రతి పాఠశాల మాతృమూర్తి ప్రేమతో పెరగాలి. కామన్ స్కూల్ సిస్టమ్ వుండాలి. సంస్కృతీ శిఖరాలను అధిరోహించాలి. సంశోధించవలసింది సముద్రమైనా వెనుదిరిగేదిలేదు... అన్నట్లుగా భవిష్యత్తరాలను తీర్చిదిద్దాలి. ఈ బాధ్యత ప్రభుత్వాలతో పాటు తల్లిదండ్రులకూ వుంది.

మంచి మాట

సుఖం కాని, దు:ఖం గాని
ఒంటరిగా అనుభవించజాలరు.
పంచుకునేవారు కావాలి.
అందుకే కుటుంబం, సమాజం.

- దాశరథి రంగాచార్య,
కవి, రచయిత.

మూడో అవతారంలో మోడీ సర్కార్

ప్రస్తుతం

తెలకపల్లి రవి

అత్యంత శక్తివంతుడైన మోడీ 3.0గా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని సాగిన ప్రచారం విఫలమై బలహీనపడిన మూడో అవతారంగా ఆదివారం అధికారం స్వీకరించడం ఆసక్తికర పరిణామం. దీనికి మరో విశేషణం కూడా జోడించవలసి వుంటుంది. మారిన పరిస్థితుల్లో ప్రధాని పదవిని అందుకోగల పోటీదార్లుగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారం చేపట్టబోతున్న చంద్రబాబు నాయుడుకు అవకాశం లభించిందన్న ప్రచారం కూడా వీగిపోయింది. నితీశ్‌కు మేమెప్పుడూ అలాంటి ప్రతిపాదన ఇచ్చింది లేదని 'ఇండియా' నాయకులు ప్రకటించేశారు. ఇక చంద్రబాబు విషయానికి వస్తే ఆయన అలాంటి ఆలోచనేదీ సూచనగానైనా చెప్పకపోగా నరేంద్ర మోడీ నాయకత్వ పటిమను, దార్శనికతను ఆకాశానికెత్తి పొగిడారు. ఇంకా చెప్పాలంటే నితీశ్ మోడీకి పాదాభివందనం చేయబోగా పక్కనున్నవారు వారించాల్సి వచ్చింది. బీహార్‌లో ఎన్నికల ప్రచారం సమయంలో ఇలాగే నితీశ్ పాదాభివందనానికి విఫలయత్నం చేశారు. నితీశ్ లాంటి సీనియర్ నాయకుడు పదవి కోసం మోడీ కాళ్లు పట్టుకోవాలనుకోవడం బీహార్ ప్రజలకు మింగుడు పడటం లేదని మృత్యుంజయ తివారి అనే సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు. ఇక చంద్రబాబు విషయానికి వస్తే దార్శనిక నేత మోడీ నాయకత్వంలో తాము ఎన్‌డిఎగా పోటీ చేస్తున్నట్టు ఒకటికి రెండు సార్లు వారు సంయుక్త ప్రకటనలే చేశారు. మోడీని ఎన్నుకునే తరుణంలోనే చంద్రబాబు మాట్లాడుతూ గతంలో అనేకమంది నాయకులు దేశాన్ని పాలించినా మోడీ హయాంలోనే మన దేశం అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందని ప్రశంసలతో ముంచెత్తారు. మోడీ, అమిత్ షా లతో సహా బిజెపి కేంద్ర నాయకులు వచ్చి ఉమ్మడి ప్రచారంలో పాల్గొన్న కారణంగానే ప్రజల్లో కేంద్రం మనతో వుందనే నమ్మకం కలిగిందని వ్యాఖ్యానించారు. ఇక జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మోడీ వుంటే భారతదేశం ఎవరి ముందూ తల వంచే పరిస్థితి రాదని ప్రత్యేకంగా కీర్తించారు. మొత్తంపైన బిజెపి మనుగడ కోసం మిత్రపక్షాలపై ఆధారపడుతుంది గనక తమ కోర్కెలపై ఒత్తిడి చేసే అవకాశం పెరుగుతుందని వ్యాఖ్యాతలు వేసిన అంచనాలు విఫలమై వారు మరింతగా మోడీ ఘనతనే ఆకాశానికి ఎత్తేందుకు సిద్ధమైనారు.

చెంపలేసుకుంటే మారిపోయినట్టేనా?

ప్రభుత్వం ఏర్పడుతున్న ప్రారంభ ఘట్టంలోనే ఇలా వుంటే రేపు మోడీ కాస్త స్థిరపడ్డాక ఏం జరుగుతుందో ఊహించడం కష్టమేమీ కాదు. ఆ అసహనం, అహం మోడీ మాటల్లో తొంగి చూసింది. నిజానికి మోడీ నాయకుడుగా ఎన్నికైన సమయంలో వ్యవహరించిన తీరే ఆయన ఎలాంటి పాఠం నేర్చుకున్నారో తెలియజెప్పింది. రకరకాల వాక్య విన్యాసాలతో చప్పట్లు కొట్టించుకునే మోడీ ముందుగా రాజ్యాంగం దగ్గరకు వెళ్లి కళ్లకద్దుకున్నారు. తను, హోంమంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరు వల్ల కొందరు నేతల వాచాలత వల్ల బిజెపి గెలుపు రాజ్యాంగానికి ముప్పు అని ప్రజలకు అర్థమైనందునే ఆమడ దూరంలో ఆపేశారని మోడీకి అర్థమైంది. అందుకే దాన్ని కాపాడతానని చెప్పడానికి ఈ ప్రహసనం తలపెట్టారన్నమాట. మాట్లాడితే ప్రతిదీ మార్చేయాలనీ తీసేయాలని చెప్పేవారు వున్న రాజ్యాంగాన్ని ఏదో గౌరవిస్తున్నట్టు చెప్పుకోవడం అందుకోసమే. అయితే ఇప్పుడు పదవీ స్వీకారం కోసం ఏం చెప్పినా రేపు వాస్తవంగా ఏం జరిగేది ప్రజలకు తెలుసు గనకే అలాంటి తీర్పునిచ్చారు. బిజెపి మొదట్లో చేసిన హడావుడితో పోలిస్తే ప్రస్తుత పరాధీనత తీవ్రమైన కుదుపు లాంటిదే. కానీ అదేదో చిన్న విషయమైనట్టు మోడీ తన ప్రసంగంలో ఎన్‌డిఎ తిరిగి వచ్చేసిందని గొప్పలు పోయారు. 30 ఏళ్లుగా ఎన్డీఎ అత్యంత విజయవంతమైన కూటమిగా పురోగమిస్తున్నదంటూ తన పదేళ్ల నిర్వాకాలను కప్పిపుచ్చే పాచిక వేశారు. ఎందుకంటే గత రెండు సార్లు పేరుకు ఎన్‌డిఎ ప్రభుత్వాలైనా బిజెపికి కూడా పెద్ద మాట లేకుండా కేవలం మోడీ ఏక వ్యక్తి ప్రాబల్యమే నడిచిన తీరు ఎవరు మర్చిపోతారు? వారు చాలా అపహాస్యం చేసిన 'ఇండియా' వేదిక వాస్తవ రూపం దాలుస్తుంటే ఉలిక్కిపడి అప్పుడే మళ్లీ ఫోటో సెషన్ లాంటి ఎన్డీఎ భేటీ నాటకం నడిపారు. అలాంటి మోడీ ఇప్పుడు ఫలితాల తర్వాత 'సర్వ పంథ్ సమ భావ్' అంటూ అన్ని పార్టీలనూ సమానంగా చూస్తామనే పాట ఎత్తుకున్నారు. వాస్తవానికి లౌకిక తత్వాన్ని 'సర్వ ధర్మ సమ భావ్' అంటూ అన్ని మతాలకు ప్రోత్సాహంగా మార్చింది పాలకులే. మెజారిటీ మత భావాలను సంతృప్తి పరుస్తూ మైనార్టీలను అభద్రత లోకి నెట్టింది ఈ పోకడలే. దాన్నే ఇప్పుడు భాగస్వామ్య పార్టీలకు అన్వయించి 'సర్వ పంథ్ సమ భావ్' అంటున్నారన్నమాట.



> నిజానికి మోడీ నాయకుడుగా ఎన్నికైన సమయంలో వ్యవహరించిన తీరే ఆయన ఎలాంటి పాఠం నేర్చుకున్నారో తెలియజెప్పింది. రకరకాల వాక్య విన్యాసాలతో చప్పట్లు కొట్టించుకునే మోడీ ముందుగా రాజ్యాంగం దగ్గరకు వెళ్లి కళ్లకద్దుకున్నారు. తను, హోంమంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరు వల్ల కొందరు నేతల వాచాలత వల్ల బిజెపి గెలుపు రాజ్యాంగానికి ముప్పు అని ప్రజలకు అర్థమైనందునే ఆమడ దూరంలో ఆపేశారని మోడీకి అర్థమైంది. అందుకే దాన్ని కాపాడతానని చెప్పడానికి ఈ ప్రహసనం తలపెట్టారన్నమాట. మాట్లాడితే ప్రతిదీ మార్చేయాలనీ తీసేయాలని చెప్పేవారు వున్న రాజ్యాంగాన్ని ఏదో గౌరవిస్తున్నట్టు చెప్పుకోవడం అందుకోసమే. అయితే ఇప్పుడు పదవీ స్వీకారం కోసం ఏం చెప్పినా రేపు వాస్తవంగా ఏం జరిగేది ప్రజలకు తెలుసు గనకే అలాంటి తీర్పునిచ్చారు. బిజెపి మొదట్లో చేసిన హడావుడితో పోలిస్తే ప్రస్తుత పరాధీనత తీవ్రమైన కుదుపు లాంటిదే. కానీ అదేదో చిన్న విషయమైనట్టు మోడీ తన ప్రసంగంలో ఎన్‌డిఎ తిరిగి వచ్చేసిందని గొప్పలు పోయారు. వారు చాలా అపహాస్యం చేసిన 'ఇండియా' వేదిక వాస్తవ రూపం దాలుస్తుంటే ఉలిక్కిపడి అప్పుడే మళ్లీ ఫోటో సెషన్ లాంటి ఎన్డీఎ భేటీ నాటకం నడిపారు.

ఎన్టీఆర్, చంద్రబాబు భిన్న వైఖరులు

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు ఏం చెప్పినా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మాత్రం ఈ విషయంలో మరింత సూటిగా మాట్లాడారు. తాము ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్ కొనసాగిస్తామన్నారు. అదే సమయంలో మైనార్టీలకు సహాయపడటం తప్ప బుజ్జగింపు తమ వైఖరి కాదంటూ బిజెపి తరహా వాదన చేశారు. జాతీయ, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య సమతుల్యత వుండాలని ఆయన అనడం ఎ.పి ప్రత్యేక సమస్యల పరోక్ష ప్రస్తావనేనని కొందరు వ్యాఖ్యానించారు గాని వాస్తవానికి ఇంతవరకూ చంద్రబాబు నుంచి తమకు ఎలాంటి షరతుల సమస్యలు ఎదురవలేదని బిజెపి వర్గాలు చెబుతూనే వున్నాయి. మంత్రి పదవుల విషయంలోనూ ఏడు పదవులు, స్పీకర్ స్థానం వంటి మాటలు గతంలో వినిపించగా ఇప్పుడు రెండు మూడు పదవులు, డిప్యూటీ స్పీకర్ అంటున్నారు. నితీశ్ కుమార్‌గానీ చంద్రబాబు నాయుడు గానీ ఏకంగా ప్రధాని పదవి చేపట్టే అవకాశాలున్నాయనే ఊహాగానాలు కూడా నడిచాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ (యు.ఎఫ్) కాలంలో ఆయనను ఈ పదవి చేపట్టవలసిందిగా కోరిన ఉదాహరణ గుర్తు చేస్తున్నారు. వాస్తవం ఏమంటే ఆ సమయంలో సిపిఎం నాయకుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ లౌకిక పార్టీల ఐక్యతలో కీలక భూమిక పోషించేవారు. చంద్రబాబును ప్రోత్సహించిందీ యు.ఎఫ్ కన్వీనర్‌గా చేసిందీ ప్రధానంగా సూర్జిత్ చొరవే. ఆ బాధ్యతలో వుంటూనే ఎన్డీఎ వైపు వెళ్లిన రాజకీయం చంద్రబాబుదే. చక్రం తిప్పడం అనే పొగడ్తల వెనక ఈ సత్యాన్ని చాలామంది తరచూ మర్చిపోతుంటారు. ప్రాంతీయ పార్టీ అయినా తమ నాయకుడు ఎన్టీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర వహించారని కూడా తరచూ చెబుతుంటారు. వాస్తవం ఏమంటే ఎన్టీఆర్ లౌకిక పార్టీల కూటమిగా నేషనల్ ఫ్రంట్‌కు మాత్రమే చైర్మన్‌గా వున్నారు. ఆ ఫ్రంట్ ప్రభుత్వాన్ని బిజెపి రథయాత్రతో కూల్చివేసిన తర్వాత ఎన్టీఆర్ ఎన్నడూ మళ్లీ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోలేదు. 1994లో టిడిపి ఉమ్మడి రాష్ట్రంలో అసాధారణ విజయం సాధించినప్పుడు ఆయన కమ్యూనిస్టులతో మాత్రమే కలసి పోటీ చేశారు. వీటన్నిటి సారాంశం ఒక్కటే. బిజెపి మిత్రుల పట్ల పెద్ద విశ్వాసంగా వుండదు. గతంలో దానితో కలసి పని చేసిన పార్టీలన్నీ టిడిపితో సహా మోసపోయిన చరిత్రే దీనికి నిదర్శనం. అవసరార్థం కలయిక అంటే అర్థం చేసుకోవచ్చుగానీ దానివల్ల మోడీ స్వభావం మారిపోతుందని, వాళ్లు అడిగినవి చేసి ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేరుస్తారని నమ్మడం నిరాధారం.

మోడీ ప్రసంగమే నిదర్శనం

రాజ్యాంగాన్ని కళ్లకు అద్దుకోవడం వంటి నాటకీయ చర్యలను పక్కన పెడితే మోడీ ఈ సభలోనూ, రాష్ట్రపతిని కలిసి ఆహ్వానం అందుకున్న తర్వాత మాట్లాడిన తీరే ఆయనలో మార్పు లేదని చెబుతుంది. 'సర్వ పంథ్ సమ భావ్' అన్న ప్రధానమంత్రి 'ఇండియా' వేదికను విధ్వంసక శక్తిగా తిట్టిపోశారు. ఎన్డీఎ అఖండ విజయం అందుకుందని చెప్పుకుంటూ అనేక రాష్ట్రాలను పాలిస్తున్న 'ఇండియా' పార్టీలు ప్రజల మద్దతుతో గణనీయంగా బలం పెంచుకున్నాయనే సత్యాన్ని కాస్తకూడా ఆమోదించలేకపోవడం ఆయన అసహనాన్ని వెల్లడించింది. మరో వంక ఒడిషాలో విజయం ఘనమైనట్టు ఉత్తర ప్రదేశ్‌లో ఎదురుదెబ్బ లెక్కలోది కానట్టు చిత్రించి సంతోషించారు. అలాంటిది నాయకులను బలోపేతం చేస్తారని ఎవరైనా ఎలా నమ్మగలరు? కాంగ్రెస్ వంద స్థానాలకు చేరిన వాస్తవాన్ని కూడా హరాయించుకోలేని మోడీ ఆ పార్టీకి మూడు ఎన్నికల్లో కలిపినా తమకు ఈ ఒక్కసారి వచ్చినన్ని సీట్లు రాలేదని ఎద్దేవా చేయడం ప్రధానికి తగిన పనేనా? చంద్రబాబు, నితీశ్ కుమార్ రాష్ట్రాలకు సహాయంపై ప్రత్యేకంగా ప్రస్తావనలు చేసినా మోడీ మాత్రం ఆ ముచ్చటే పెట్టుకోకపోవడం యాదృచ్ఛికం కాదు. ఇక ముస్లింలు, దళితులలో సృష్టించిన సందేహాలను తొలగించడం అవసరమనీ ఆయన అనుకోలేదు. ఎందుకంటే వాటిని కొనసాగించాలన్నదే బిజెపి, ఆర్.ఎస్.ఎస్‌ల వ్యూహం. దేశానికి బాగా ఉపయోగపడే నిర్ణయాలు చేస్తాము. మరింత కఠినంగా వేగంగా పనిచేస్తాము...అంటూ శ్లేష ప్రయోగించారు. ఈ ఎన్నికల ఫలితాలకు ముందే వచ్చే పదవీ కాలంలో చేయవలసిన పనులు చర్చించి ప్రచారంలో పెట్టిన మోడీ ఈ సభలోనూ తాము మరో పదేళ్లు పాలన చేస్తామన్నారు. అయిదేళ్లకు ఎన్నికైన సర్కారు పదేళ్ల గురించి చెప్పడమేంటి? అంటే ఇందులోని అతి తెలివిని గమనించాలి. పూర్తి మెజారిటీ లేని మోడీని ఎవరో ఒకరు ఎప్పుడైనా కూలదోయవచ్చునని కథనాలు వచ్చాయి గనక ఏకంగా తమ పాలనా కాలాన్ని రెట్టింపు చేసి చెప్పేస్తున్నారన్నమాట. ప్రచారక్ ప్రధానమంత్రి (పిపిఎం) మోడీకి బాగా అలవాటైన వాగాడంబరం ఇదే.

జాగ్‌తే రహో!

ప్రభుత్వ రంగంపైన లేదా ఉద్యోగ వర్గాల, రైతాంగ ఉద్యమాల కోర్కెలను నెరవేర్చే ప్రయత్నం చేస్తామని ఒక్క మాట కూడా అన్న దాఖలాలు లేవు. నిర్దిష్టంగా ఏ తరగతికి గానీ రాష్ట్రాలకు గానీ ఎలాంటి మాట ఇవ్వకుండా ఊకదంపుడుతో సరిపెట్టే వచోవిన్యాసం మోడీ స్వంతం. అయినా ఆయన వత్తాసుదార్లు మాత్రం దానికే పరవశించమని చెబుతుంటారు. ఈ ఎన్నికల తీర్పు ప్రధానంగా సమాఖ్య తత్వానికి, ఆర్థిక వనరుల బదలాయింపునకూ ప్రజలు ఇచ్చిన సందేశమని నిపుణులు అంటుంటే ప్రధాని ఆ మాటే చెవికెక్కించుకోలేదు. మరో వైపున నేను, బాబు, నితీశ్ అందరం సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్) కు ప్రతినిధులమని చెప్పుకున్నారు. ఎవరైనా సరే నిధులు లేకుండా ఎలా సుపరిపాలన చేయగలరు? ఎ.పి లాంటి విభజిత రాష్ట్రం అప్పుల నుంచి ఎలా బయటకు రాగలదు? ఎ.పి తో సహ చాలా రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడం గురించి వింటుంటాం గానీ మోడీజీ పాలిస్తున్న కేంద్రమే దాదాపు రెండు కోట్ల కోట్ల అప్పులో దిగబడిపోయిందనే నిజానికి సమాధానమేదీ? ఇలాంటి కఠిన ప్రశ్నలేవీ వేయకుండా విశ్వగురు, దార్శనికుడు అంటూ ఆయనను పొగిడి పరవశించడమేనా కర్తవ్యం? దీనంతటికీ పరాకాష్ట ప్రమాణ స్వీకారం సన్నివేశంలో చూడొచ్చు. ఏమైనా బిజెపి ఏకఛత్రాధిపత్యం, మోడీ ఏకపక్ష పాలనా ఘట్టం ముగిసింది కానీ కేంద్ర నిరంకుశత్వ మతతత్వ ప్రమాదం మిగిలే వుంది. రకరకాల అవకాశవాదాల మధ్య అననుకూలతల మధ్య లౌకిక శక్తులు దాన్ని అడ్డుకోవలసిన బాధ్యత మరింత పెరుగుతున్నది. కాగాపోగా మోడీ బలహీనపడిన కారణంగా కార్పొరేట్ ఒత్తిళ్లు, ఈ సర్కారు లొంగుబాట్లు ఇంకా పెరగొచ్చు కూడా. వాటన్నిటికీ మూల్యం చెల్లించవలసిన వారు ప్రజలే. మోడియా ప్రచారార్భాటాలకు లోబడిపోకుండా వాటి పట్ల అప్రమత్తత పెంచుకుందాం.

2024 ఫలితాలు : మళ్లీ ఎజెండాలోకి ఆర్థిక న్యాయం

విశ్లేషణ

జయతీ ఘోష్

ఎగ్జిట్ పోల్స్ నిజమవుతాయని నమ్మిన వారిని 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ప్రధాన ప్రసార ముద్రణా మాధ్యమాలు మోడీ రాయమన్నట్టల్లా తూచా తప్పకుండా రాశాయి మరి. చాలామంది పండితులు, ఎంతో ఆత్మవిశ్వాసంతో తాము ప్రకటించిన తప్పుడు భవిష్యవాణిని, వాస్తవ ఫలితాలతో లంకె చేసుకుని, సమర్థించుకునే పనిలో పడ్డారు. 'ఇండియా' వేదిక సామాజిక న్యాయంపై మరింత ఎక్కువ ధ్యాస పెట్టి, కుల జన గణన చేస్తానని అన్నందువలన, మిత్ర పక్షంలోకి అన్ని రకాల పార్టీలను కలుపుకున్నందువలన, సభ్యుల ఎన్నిక కులాధారంగా జరపడంలో మరింత నిక్కచ్చిగా వ్యవహరించినందువలన లాభపడిందనే సమర్థన అందులో ప్రధానమైనది.

స్పష్టమైన సందేశం

సామాజిక న్యాయం అమలు కాదన్న భయం, రాజ్యాంగం మనుగడపై భయాందోళనలు ఏర్పడడం వంటివి ఎన్నికలలో ప్రధాన పాత్ర పోషించిన మాట వాస్తవమే. రాష్ట్రాలలో స్థానిక సమస్యలు కూడా సముచిత పాత్ర పోషించి ఉంటాయి. కానీ, రాబోయే కాలంలో ఏ కూటమి అధికారాన్ని హస్తగతం చేసుకున్నా ఓటర్లిచ్చిన సందేశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి: ఆర్థిక సమస్యల ప్రాధాన్యత-నిరుద్యోగ సంక్షోభం, నిరంతరంగా కొన సాగుతున్న అత్యల్ప వేతనాలు, స్వయం ఉపాధి కల్పించుకుంటున్నా, ఆ ఆదాయాలతో జీవితాలు దుర్భరంగా కొనసాగుతుండడం. వీటికి తోడుగా నిరంతరంగా పెరుగుతున్న ధరలు-మోడీ ప్రభుత్వం వీటిని వేటినీ పట్టించుకున్న పాపాన పోలేదు. విధానపరమైన చర్యలు తీసుకునేటప్పుడు గాని, ఎన్నికల ప్రచారాలలో గాని ఇవేవీ పరిగణనలోకి తీసుకోలేదు. అయినప్పటికీ, ఈ కూడు గూడు సమస్యలే దేశంలో అత్యధిక ప్రజల జీవిత నిర్ణయాత్మక సమస్యలుగా ఇప్పటికీ మిగిలి ఉన్నాయి.

దీని ఫలితంగానే, వీటిని అందిస్తామని వాగ్దానం చేసిన ప్రతిపక్షం, ప్రధానంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో జరిగిన ఎన్నికలలో ముందంజ వేశాయి. మోడీ పాలన లాగా కాకుండా లేదా వారి అనుయాయుల ప్రచార వాగాడంబరపు ఉపన్యాసాలకు భిన్నంగా ప్రతిపక్షాలు నిరుద్యోగ, జీవనభృతి సమస్యలను, సామాజిక న్యాయంతో పాటుగా చర్చించాయి. ఓటర్లను ఈ వాగ్దానాలు ఆకట్టుకున్న మాట నిజం.

మౌలిక మార్పు

కాంగ్రెస్ మేనిఫెస్టో యువకులకు, మహిళలకు, కార్మికులకు సామాజిక న్యాయం అందించేందుకు ప్రాధాన్యత ఇచ్చింది. ఉదాహరణకు, ఇవన్నీ సాధించడానికి ఆర్థిక విధానాల్లో పెద్ద మార్పు తేవలసి ఉంటుంది. నిజం చెప్పాలంటే మౌలికమైన మార్పులు చేయాల్సి ఉంటుంది. అత్యున్నత నాయకుడు లేదా రాజ్యం, ప్రజలకు సేవలందించడం, అవసరాలకు తగిన వస్తువులను 'బహుమతులుగా' సమకూర్చడం సరిపోదు.

ఈ వాగ్దానాలను అమలు చేయాలంటే విధానపరమైన మౌలిక మార్పులు చేయాల్సి ఉంటుంది. మొట్టమొదటిగా, పని హక్కును కల్పించాలి (అంటే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మరింత సౌలభ్యంగా మలచాలి. దానికి నిధుల కేటాయింపులు మరింత పెంచాలి. అంతేకాక, పట్టణాల్లో కూడా ఈ పథకాన్ని అమలు చేయాలి.). ఇప్పటికీ ఆహార హక్కు కనీసం పది కోట్ల మంది పేదలకు కూడా అందుబాటులో లేదు. ఖరీదైన, ఉన్నత ప్రైవేటు విద్య కొందరికే అందుతున్నదిగాని ప్రజలకు విద్య హక్కుగా అందుబాటులో ఉండటం లేదు. విద్యాహక్కు సార్వజనీనం కాలేదు. సామాజిక భద్రతా హక్కు (అంటే ఏదైనా కారణంగా పనిచేయలేని వారికి, వృద్ధులకు, కనీస వేతనంలో సగం ఇవ్వడం) కల్పించాలి. ఆరోగ్య భద్రతా హక్కును కూడా ప్రజారోగ్యం ద్వారా సమకూర్చాల్సి ఉంటుంది.

> ఈ వాగ్దానాలను అమలు చేయాలంటే విధానపరమైన మౌలిక మార్పులు చేయాల్సి ఉంటుంది. మొట్టమొదటిగా, పని హక్కును కల్పించాలి (అంటే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మరింత సౌలభ్యంగా మలచాలి. దానికి నిధుల కేటాయింపులు మరింత పెంచాలి. అంతేకాక, పట్టణాల్లో కూడా ఈ పథకాన్ని అమలు చేయాలి.). ఇప్పటికీ ఆహార హక్కు కనీసం పది కోట్ల మంది పేదలకు కూడా అందుబాటులో లేదు. ఖరీదైన, ఉన్నత ప్రైవేటు విద్య కొందరికే అందుతున్నదిగాని ప్రజలకు విద్య హక్కుగా అందుబాటులో ఉండటం లేదు. విద్యాహక్కు సార్వజనీనం కాలేదు. సామాజిక భద్రతా హక్కు (అంటే ఏదైనా కారణంగా పనిచేయలేని వారికి, వృద్ధులకు, కనీస వేతనంలో సగం ఇవ్వడం) కల్పించాలి. ఆరోగ్య భద్రతా హక్కును కూడా ప్రజారోగ్యం ద్వారా సమకూర్చాల్సి ఉంటుంది. రెండో ప్రధానమైన అంశం, కోట్లాది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం. నిరాశా నిస్పృహలకు గురైన యువకుల ఆశలు నెరవేర్చడం. అదే ప్రధానమైన ఆర్థిక విధానపర లక్ష్యంగా ఉండాలి. ఈ లక్ష్యం సాధించాలంటే, ప్రభుత్వోద్యోగాలు పెరగాలి. స్కీమ్ వర్కర్లతో సహా అన్ని ప్రభుత్వ సంస్థల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలి. క్రమబద్ధీకరించాలి.

రెండో ప్రధానమైన అంశం, కోట్లాది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం. నిరాశా నిస్పృహలకు గురైన యువకుల ఆశలు నెరవేర్చడం. అదే ప్రధానమైన ఆర్థిక విధానపర లక్ష్యంగా ఉండాలి. ఈ లక్ష్యం సాధించాలంటే, ప్రభుత్వోద్యోగాలు పెరగాలి. స్కీమ్ వర్కర్లతో సహా అన్ని ప్రభుత్వ సంస్థల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలి. క్రమబద్ధీకరించాలి. దశాబ్దాల తరబడి ప్రభుత్వ విధానాల లోపం ఫలితంగా ఉక్కిరి బిక్కిరి అవుతున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ప్రాణం పోయాలి. వారందరికీ రుణ పరపతి కల్పించాలి. కొత్త యంత్రాలు కొనుగోలు చేసేందుకు వెసులుబాటు కల్పించాలి. శిక్షణ అవకాశాలు కల్పించాలి. వారి ఉత్పత్తుల అమ్మకాలకు వసతులు కల్పించాలి. ఇప్పటికీ వ్యవసాయం సంక్షోభంలోనే ఉంది. రైతుల న్యాయమైన డిమాండ్లను పార్లమెంటులో ప్రత్యేక సెషన్‌లో సమగ్రంగా చర్చించి పరిష్కరించాలి. దేశంలో పర్యావరణం మార్పులకు లోనవుతుండడంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టి చర్చించాలి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న 'కొత్త సంస్కరణల' గురించి గొప్పగా ప్రచారం జరిగింది. కానీ నిజానికి అదంతా "సంస్కరణలకు కొత్త అందాలు అద్దడం" మాత్రమే. అంతర్గతంగా పెద్ద మార్పులు చేసిందేమీ లేదు. దేశంలోని పేదరికాన్ని, అత్యంత హీనమైన మానవాభివృద్ధి సూచికలను దృష్టిలో పెట్టుకుంటే, కేంద్రంగాని, రాష్ట్రాలుగాని ఈ మాత్రం సంస్కరణలు అమలు చేయక తప్పని పరిస్థితి. కానీ మోడీ ప్రభుత్వం ఇవన్నీ తమ హయాంలో మాత్రమే అమలు చేస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంది. ప్రచారం చేసుకుంది. నిజానికి వాటిని పౌర హక్కులు నిర్వర్తించే పథకాలుగా చెప్పుకుని ఉండవలసింది. ఉదాహరణకు, ఉచిత రేషన్ అందించడం ద్వారా దేశంలోని 80 కోట్ల పేదలకు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రత కల్పించడం. ఇంతకీ ఇదేంటంటే గత యు.పి.ఎ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ ఆహార భద్రత చట్టం కొనసాగింపే. ఈ పథకం కింద కిలో గోధుమలు 2 రూపాయలకి, కిలో బియ్యం 3 రూపాయలకి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించేవారు. ప్రభుత్వం వీటికి అత్యధిక సబ్సిడీ ఇచ్చేది. అందువలన ఇవేమీ కొత్త పథకాలు కావు. మనకిప్పుడు కావలసింది, ప్రజలకి అందించవలసిన హక్కులను "బహుమతులుగా" ఇచ్చే విధానానికి స్వస్తి పలకడం.

సమాఖ్య స్వరూపాన్ని పునరుద్ధరించాలి

ఈ ఎన్నికల తరువాత...ప్రజాతంత్ర విధానానికి వ్యతిరేకంగా గత పదేళ్లుగా జరుగుతున్న అధికార కేంద్రీకరణ మారి మరింత నిజమైన సమాఖ్య స్వరూపం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజా సేవలు అందించడంలో రాష్ట్రాలదే ప్రధాన పాత్ర. రాష్ట్రాలు ఈ సేవలను కేంద్రం జోక్యం, పక్షపాతం, నియంత్రణ లేకుండా అందించే పరిస్థితిలో వుండాలి.

/ వ్యాసకర్త మసాచుసెట్స్ ఆమెర్స్ట్ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ఆమె న్యూ ఢిల్లీ లోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో 35 ఏళ్ల పాటు అధ్యాపకురాలిగా పనిచేశారు. /

('ది హిందూ' సౌజన్యంతో)

'ఇండియా' నేతలకు అందని ఆహ్వానం

నేడు మోడీ ప్రమాణస్వీకారం

- సాయంత్రం 7.15 గంటలకు వేడుక
- దేశ, విదేశాల నుంచి 8 వేల మంది అతిథులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో సాధారణ మెజారిటీ సాధించలేకపోయిన బిజెపి ఈ దఫా ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఎన్‌డిఎ నేతగా ఎన్నికైన నరేంద్ర మోడీ ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన నిపుణు లు, కళాకారులు సహా 8,000 మంది అతిథులు హాజరుకానున్నారు. అయితే ఈ కార్యక్రమానికి ప్రతిపక్షాల ఐక్య వేదిక అయిన 'ఇండియా' ఫోరం నేతలకు ఎవ్వరికీ ఆహ్వానాలు పంపలేదని సంబంధికులు తెలిపారు. శనివారం సాయంత్రం 3 గంటల వరకు తమకు ఆహ్వానాలు అందలేదని 'ఇండియా' నేతలు పలువురు పేర్కొన్నారు. ఆహ్వానాలు అందనప్పుడు ప్రమాణస్వీ కారోత్సవానికి వెళ్లడంపై ఆలోచన కూడా ఉండదని వారు పేర్కొన్నారు.

బిజెపి పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మోడీ ఎన్నికకావడం, ఆ తర్వాత జాతీయ ప్రజాతంత్ర కూటమి (ఎన్‌డిఎ) భాగస్వామ్య పక్షాలు తమ మద్దతు లేఖలను సమర్పించడం, అనంతరం గత శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోడీని ప్రధానిగా నియమించిన సంగతి తెలిసిందే. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం 7:15 గంటలకు ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రి మండలి సభ్యులతో ముర్ము ప్రమాణం చేయిస్తారు.

ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి నేతలు తరలిరానున్న నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఐదు కంపెనీల పారామిలటరీ సిబ్బంది, ఎన్‌ఎస్జి కమాండోలు, డ్రోన్లు, స్నిపర్లతో సహా బహుళ స్థాయి భద్రతాతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ మీదుగా విమానాలు, డ్రోన్లు రాకపోకలను నిషేధిస్తూ ఈ ప్రాంతాన్ని నో-ఫ్లై జోన్‌గా ప్రకటించారు. ఈ నెల 10 వరకు ఈ నిషేధం అమలులో ఉంటుంది. విదేశీ ప్రముఖుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన హోటళ్లలో మెరుగైన భద్రతా చర్యలు అమల్జేస్తున్నారు. లీలా, తాజ్, ఐటిసి మౌర్య, క్లారిడ్జ్‌లు, ఒబెరాయ్ వంటి ప్రముఖ హోటళ్ల వద్ద పెద్ద సంఖ్యలో భద్రతా బలగాలను మోహరింపజేశారు.

తరలిరానున్న దేశాధినేతలు

ఆదివారం జరగనున్న మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి పొరుగుదేశాలైన మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్, సీషెల్స్ నుంచి ఆయా దేశాధినేతలు తరలిరానున్నారు. 'నైబర్‌హుడ్ ఫస్ట్' పేరిట ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ భారత్ పంపిన ఆహ్వానాలను పొరుగుదేశాల అధినేతలు స్వాగతించారు.

కేబినెట్‌లో 27-30 మంది మంత్రులు

కేంద్ర కేబినెట్‌లో ఈ దఫా 27 నుంచి 30 మంది వరకు మంత్రులు ఉండే అవకాశముంది. వీరిలో మూడో వంతు బెర్తులు ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాలకే కేటాయించాల్సివుంటుంది. వీరితో పాటు సహాయ మంత్రులు కూడా పెద్ద సంఖ్యలో ఉండే అవకాశముంది. ప్రతి నలుగురు, ఐదుగురు ఎంపిలకు ఒక క్యాబినెట్ మంత్రి పదవి, ప్రతి ఇద్దరికి ఒక సహాయ మంత్రి పదవుల ఫార్ములాతా కేబినెట్ పదవులు కేటాయించేవీలుందని ఎన్‌డిఎలోని కీలక నేత ఒకరు తెలిపారు. కేబినెట్ కూర్పుపై ఇప్పటికే ప్రధాని మోడీ దిశానిర్దేశంలో కేంద్ర మంత్రులుగా రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జెపి నడ్డా భాగస్వామ్యపక్షాల నేతలతో చర్చలు జరిపారు. మోడీ ప్రమాణస్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని అమెరికాలోనూ ఆయన మద్దతుదారులు 22 నగరాల్లో వేడుకల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బిజెపి-యుఎస్ఎ న్యూయార్క్, జెర్సీ సిటీ, వాషింగ్టన్ డిసి, బోస్టన్, టంపా, అట్లాంటా, హ్యూస్టన్, డల్లాస్, చికాగో, లాస్ ఏంజిల్స్, శాన్ ఫ్రాన్సిస్కో వంటి నగరాల్లో ఈ వేడుకలు నిర్వహించనున్నారు.

విదేశీ నాయకులకేనా ఆహ్వానాలు : జైరాం రమేశ్

ప్రధాని మోడీ ప్రమాణస్వీకారోత్సవానికి విదేశీ నాయకులను ఆహ్వానించడానికే ప్రాధాన్యత ఇచ్చారు కానీ, ప్రజాతీర్పుతో నెగ్గిన 'ఇండియా' ఫోరం నేతలను ఆహ్వానించలేదని పలువురు నేతలు వాపోయారు. 'ఇండియా' ఫోరం నేతలకు ఎవ్వరికీ ఇప్పటి వరకు ఆహ్వానం అందలేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ శనివారం సాయంత్రం 3 గంటలకు మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

'మోడీ ప్రమాణస్వీకారోత్సవానికి కేవలం విదేశీ నాయకులనే ఆహ్వానించినట్లు తెలుస్తోంది. మా ఫోరం నేతలెవ్వరికీ ఇప్పటి వరకు ఆహ్వానాలు అందలేదు. ఆహ్వానాలు అందినప్పుడు వెళ్లాలా? వద్దా? అనే అంశంపై నిర్ణయం తీసుకుంటాం' అని జైరాం రమేశ్ అన్నారు.

మేం వెళ్లం : మమత బెనర్జీ

చట్ట విరుద్ధంగా, అప్రజాస్వామికంగా ఏర్పాటవు తున్న ఒక ప్రభుత్వానికి తాము శుభాకాంక్షలు చెప్పజాలమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ అన్నారు. మోడీ ప్రభుత్వం గతంలో 'మంద బలం'తో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) వంటి వినాశకరమైన చట్టాలను తీసుకొచ్చిందని, వాటిని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'చట్ట వ్యతిరేకంగా, అప్రజాస్వామికంగా ఏర్పాటవుతున్న ప్రభుత్వానికి మేం శుభాకాంక్షలు చెప్పలేం. పార్టీలను విచ్ఛిన్నం చేయడమే వారి పని. అయితే చాలా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. వారే కూలిపోతారు. గతంలో ఒక రోజు మాత్రమే మనుగడ సాగించిన ప్రభుత్వాలను చూశాం. ఇప్పుడు ఏదైనా జరగవచ్చు. పైగా ప్రమాణస్వీకారోత్సవానికి మాకు ఆహ్వానం అందలేదు. అందువల్ల మేము వెళ్లే ప్రసక్తే లేదు' అని ఆమె తెలిపారు. కాగా తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్మన్‌గా మమత బెనర్జీ ఎన్నిక కాగా, లోక్‌సభలో పార్టీ నేతగా సుదీప్ బంధోపాధ్యాయ, ఉప నేతగా కకోలి ఘోష్ దస్తిదార్ ఎన్నికయ్యారు. రాజ్యసభ పక్ష నేతగా డెరెక్ ఒబ్రయిన్, ఉపనేతగా తొలిసారి ఎంపీగా ఎన్నికైన సాగరికా ఘోష్ ఎన్నికయ్యారు.

రామ్మోహన్ నాయుడు

పెమ్మసాని చంద్రశేఖర్

హరీష్ బాలయోగి

తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్

దగ్గుమళ్ల ప్రసాద్

సిఎం రమేష్

టిడిపికి నాలుగు, జెడియుకి రెండు

- జనసేనకు ఒకటి, ఏపి బిజెపి నుంచి ఒకరు
- కేంద్ర మంత్రిమండలిలో చోటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో బోటాబోటీ స్థానాలతో గట్టెక్కిన బిజెపి లోక్‌సభలో సాధారణ మెజారిటీగా దూరంగా ఉండిపోవడంతో ఈ దఫా ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాలపైనే పూర్తిగా ఆధారపడాల్సివస్తోంది. ప్రధానంగా కూటమిలో బిజెపి తర్వాత అధిక స్థానాల్లో విజయం సాధించిన టిడిపి, జెడియు ప్రభుత్వ ఏర్పాటులో క్రియాశీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్ర కెబినెట్‌లో ఆ పార్టీల నుంచి బెర్తుల కోసం డిమాండ్ ఏర్పడింది. టిడిపికి నాలుగు శాఖలు, జెడియుకు రెండు శాఖలు దక్కే వీలుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఎ కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన జనసేనకు ఒక కేబినెట్ పదవి ఇచ్చే వీలుంది. దీంతోపాటు రాష్ట్ర బిజెపి నుంచి ఒకరికి అవకాశం కల్పించనున్నారు. కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కించుకున్న నలుగురు టిడిపి నేతలలో రామ్మోహన్ నాయుడు (శ్రీకాకుళం), పెమ్మసాని చంద్రశేఖర్ (గుంటూరు), హరీష్ బాలయోగి (అమలాపురం), దగ్గుమళ్ల ప్రసాద్ (చిత్తూరు) ఉన్నారు. జనసేన నుంచి కాకినాడ ఎంపి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, బిజెపి నుంచి అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ కు కేంద్రమంత్రి పదవులు దక్కనున్నాయి. బీహార్‌లో నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడియు నుంచి ఇద్దరు సీనియర్ నేతలు లాలన్ సింగ్, రామ్ నాథ్ ఠాకూర్ పేర్లను కేబినెట్ బెర్తుల కోసం ఆ పార్టీ ప్రతిపాదించింది. లాలన్ సింగ్ బీహార్ ముంగేర్ నుంచి లోక్ సభకు ఎన్నిక కాగా, రామ్ నాథ్ ఠాకూర్ రాజ్యసభ ఎంపిగా ఉన్నారు. ఠాకూర్ భారతరత్న గ్రహీత కర్పూరి ఠాకూర్ కుమారుడు కావడం విశేషం.

కీలక శాఖల కోసం పట్టుబడుతున్న మిత్రులు

కొత్తగా ఏర్పడే మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో ఐటి, రైల్వేస్ వంటి కీలకమైన మంత్రిత్వ శాఖల కోసం తెలుగుదేశం, జెడి(యు) పట్టుబడుతున్నాయి. మంత్రివర్గం ప్రమాణ స్వీకారం తరువాతే శాఖల కేటాయింపుపై చర్చిద్దామని ఎన్డీయేలోని తన మిత్రులకు బిజెపి నేతలు నచ్చజెప్పే యత్నం చేస్తున్నారు. ఎవరు ఏం కోరినా, అంతిమ నిర్ణయం మోడీదేనని బిజెపి నేతలు చెబుతున్నారు. శుక్రవారం ఎన్డీయే సమావేశం తరువాత బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, అమిత్ షాలను కలిసిన ఈ పార్టీల నేతలు మంత్రిపదవులు, శాఖలకు సంబంధించి డిమాండ్ల చిట్టాను వారికి సమర్పించారు.. పట్టణ వ్యవహారాలు, ఐటి, జల వనరులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖలు అప్పగించడంతోబాటు ఆర్థిక సాయం కూడా అందించాలని కోరినట్లు తెలిసింది. మరో వైపు జెడి(యు) వ్యవసాయం, రైల్వేస్, మరి కొన్ని ముఖ్యమైన శాఖలు కావాలని పట్టుబడుతోంది. బిజెపి నాయకత్వం మాత్రం హోం, ఫైనాన్స్, రక్షణ, రైల్వేస్, న్యాయ వ్యవహారాలు, ఐటి ఈ ఆరు కీలక శాఖలను ఇవ్వడానికి అంతగా ఇష్టపడడం లేదని తెలిసింది.



15 నుంచి లోక్‌సభ తొలి సెషన్

- కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 15 నుంచి 18వ లోక్‌సభ తొలి సెషన్ ప్రారంభం కానుంది. కొత్తగా ఎన్నికైన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేస్తారు. రెండ్రోజుల పాటు ప్రమాణ స్వీకారం, ఆ తరువాత కొత్త స్పీకర్‌ను ఎన్నుకుంటారు. మరుసటిరోజు రాష్ట్రపతి లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. తద్వారా సెషన్‌ను అధికారికంగా ప్రారంభిస్తారు. సెషన్ తేదీలపై కొత్త కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. ఈ సమావేశంలో ప్రధాని మోడీ తన మంత్రి మండలి సభ్యులను ఉభయ సభలకు పరిచయం చేస్తారు. ఈ నెల 22న సెషన్ ముగిసే అవకాశం ఉంది. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసిన వెంటనే కేబినెట్ భేటీ అయ్యే అవకాశం ఉంది. కేంద్ర మంత్రివర్గం సలహా మేరకు 17వ లోక్‌సభను జూన్ 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రద్దు చేశారు. బిజెపి పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మోడీ ఎన్నికపై బిజెపి చీఫ్ జేపీ నడ్డా ఆమెకు లేఖ ఇవ్వడం, ఎన్‌డిఎ నాయకులు మద్దతు లేఖలు సమర్పించడంతో ముర్ము శుక్రవారం మోడీని ప్రధానిగా నియమించిన సంగతి తెలిసిందే.

మహారాష్ట్రలో మళ్లీ కొనుగోళ్ల పర్వం

- ఇద్దరు యుబిటి ఎంపీలతో సిఎం సంప్రదింపులు

ముంబయి : మహారాష్ట్రలో సంఘ్ పరివారం మరోమారు కొనుగోళ్ల పర్వానికి తెరలేపింది. శివసేనను ముక్కలు చేసి అక్కడ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి ఇప్పుడు కేంద్రంలో తక్కువ స్థానాలు లభించిన నేపథ్యంలో అవకాశమున్న చోటల్లా ఎంపీల కొనుగోళ్లకు కుయుక్తులు పన్నుతున్నట్లు కనిపిస్తోంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని ఉద్ధవ్ బాలసాహెబ్ థాకరే (యుబిటి) శివసేనకు చెందిన ఇద్దరు ఎంపీలకు ఎర వేసేందుకు అక్కడి బిజెపి మిత్రపక్షమైన శివసేన (ఏకనాథ్ షిండే గ్రూపు) ప్రయత్నిస్తోంది. 'ఇండియా' ఫోరంలో భాగంగా ఉన్న యుబిటి నుంచి పోటీ చేసి ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన ఇద్దరు ఎంపీలకు, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకి మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయని శివసేన (ఏక్‌నాథ్ షిండే గ్రూపు) అధికార ప్రతినిధి నరేశ్ మస్కే తెలిపారు. అయితే ఇద్దరి ఎంపీల పేర్లు వెల్లడించేందుకు నరేశ్ నిరాకరించారు. ఆ ఇద్దరి ఎంపీలతో పాటు మరో నలుగురు ప్రజా ప్రతినిధులు త్వరలోనే తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఆ ప్రకటనను వెనక్కు తీసుకున్న డబ్ల్యుహెచ్ఒ

న్యూయార్క్ : బర్డ్ ఫ్లూ వైరస్ తో ఒక వ్యక్తి మరణించారని ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ వెంటనే ఈ ప్రకటనను వెనక్కు తీసుకుంది. మరణించిన వ్యక్తికి ఇతర అనారోగ్య కారణాలు ఉన్నాయని, హెచ్5ఎన్2కి ఆపాదించబడిన మరణం కాదు.. అని స్పష్టం చేసింది. మరణించిన వ్యక్తికి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించామని, ఆ వ్యక్తికి దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలు, టైప్ 2 మధుమేహం, రక్తపోటు సమస్యలు ఉన్నాయని వెల్లడించింది. ఈ మరణం బహుళ-కారకాల కారణాలతో జరిగిందని, హెచ్5ఎన్2కి ఆపాదించబడిన మరణం కాదు అని డబ్ల్యుహెచ్ఒ ధ్రువీకరించింది.

నిరసన గళాలపై ఉక్కుపాదం!

- దేశ వ్యతిరేకులంటూ ముద్ర
- నలుగురు ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు
- ప్రభుత్వ విధానాలను విమర్శించిన టీచర్‌పైనా వేటు

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికల అనంతరం అణచివేత చర్యలు మొదలయ్యాయి. నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను దేశ వ్యతిరేకులుగా ముద్ర వేస్తూ విధుల నుండి తొలగించారు. పైగా వారికి తీవ్రవాద కార్యకాలాపాలతో సంబంధం వుందని ఆరోపిస్తూ అందుకే ఈ చర్యలు తీసుకున్నామని జమ్మూ కాశ్మీర్ పాలనా యంత్రాంగం పేర్కొంది. రోడ్ల పరిస్థితి అస్సలు బాలేదంటూ ప్రభుత్వాన్ని ఆన్‌లైన్‌లో తీవ్రంగా విమర్శించినందుకు ఆ వీడియో పోస్టు చేసిన టీచర్‌ను కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తొలగించిన వారిలో ఇద్దరు పోలీసు సిబ్బంది, జలశక్తి శాఖకు చెందిన ఉద్యోగి, టీచర్ వున్నారు. జాతి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు రాజ్యాంగంలోని 311 అధికరణ కింద ఈ ఉద్యోగులను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి విచారణ జరపకుండానే భద్రతా సంస్థలు ఇచ్చిన నివేదికలను ఆధారంగా చేసుకుని ఈ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. తొలగించిన వారిలో పుల్వామాలోని లార్మూహ్‌లో పోలీసు విభాగానికి చెందిన సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్ అబ్దుల్ రహమాన్ దార్, లాల్‌గమ్‌కి చెందిన మరో కానిస్టేబుల్ గులాం రసూల్ భట్, కుల్గామ్‌లోని బంగమ్‌కి చెందిన టీచర్ షబీర్ అహ్మద్ వనీ, బారాముల్లాకి చెందిన జల శక్తి విభాగంలో అసిస్టెంట్ లైన్‌మేన్ అనయతుల్లా షా వున్నారు. వీరందరికీ తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని, తీవ్రవాద దాడులకు పాల్పడేందుకు అవసరమైన సాయాన్ని అందిస్తున్నారంటూ ప్రభుత్వం వారిపై ఆరోపణలు చేసింది. దోడా జిల్లాలోని చెనాబ్ లోయ ప్రాంతానికి చెందిన టీచర్ ఫియాజ్ అహ్మద్ రోడ్ల దుస్థితిని తెలియచేస్తూ ఒక వీడియో చేశారు. ద్రామన్ గవర్నమెంట్ మిడిల్ స్కూల్లో వసతులు సరిగా లేవని విమర్శించారు. ఆ వీడియో బాగా వైరల్ అయింది. దానిపై ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్నారంటూ ఆ టీచర్‌ను సస్పెండ్ చేశారు. పైగా దానిపై ఆ టీచర్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం విచారణకు అవకాశం లేకుండా ఇలా ఏకపక్షంగా తొలగించడం సహజ న్యాయసూత్రాలకే విరుద్ధమని పలువురు విమర్శిస్తున్నారు.

జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ షురూ

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అధికారికంగా ప్రారంభించింది. జమ్మూ కాశ్మీర్‌లోని కేంద్ర పాలిత ప్రాంత (యుటి) శాసనసభకు సాధారణ ఎన్నికల కోసం 1968 ఎన్నికల చిహ్నాల (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్ 1968లో పేరా 10బి కింద ఉమ్మడి గుర్తును కేటాయించాలని కోరుతూ దరఖాస్తులను ఆమోదించాలని కమిషన్ నిర్ణయించిందని ఇసిఐ సెక్రెటరీ జయదేబ్ లాహిరి ఒక ప్రెస్ నోట్ ద్వారా వివరించారు. జమ్మూకాశ్మీర్ ప్రజలు తమ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని యూటీలో త్వరలో ఏర్పాటు చేస్తారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ పేర్కొన్నట్టు స్పష్టం చేశారు. 2014లో జమ్మూకాశ్మీర్‌లో చివరి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ముఫ్తీ మహ్మద్ సయీద్ నేతృత్వంలోని బిజెపి, పిడిపిల సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2016లో ముఖ్యమంత్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ మరణం తర్వాత, సంకీర్ణానికి ఆయన కుమార్తె మెహబూబా ముఫ్తీ నేతృత్వం వహించారు. జూన్ 18, 2019న సంకీర్ణ ప్రభుత్వం నుంచి బిజెపి వైదొలిగింది. ఆ తర్వాత మెహబూబా ముఫ్తీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో జమ్మూకాశ్మీర్‌లో గవర్నర్ పాలన విధించబడింది. ఆ తర్వాత రాష్ట్రపతి పాలన వచ్చింది. ఆగస్టు 5, 2019న ఆర్టికల్ 370, 35(ఎ)ను మోడీ సర్కారు రద్దు చేసింది. రాష్ట్రాన్ని రెండు యూటీలుగా చేసింది. దీంతో అప్పటి నుంచి జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో ఉన్నది.

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

ఇంఫాల్/న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మణిపూర్‌లోని జిరిబమ్ జిల్లాలో కొందరు అనుమానిత తిరుగుబాటుదారులు దుండగులు పోలీస్ స్థావరాలపై దాడిచేయడంతో పాటు కొన్ని నివాసాలకు నిప్పు పెట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. జిరిబమ్ జిల్లా పక్కనే ఉన్న బరాక్ నది నుండి మూడు నాలుగు బోట్లలో తిరుగుబాటుదారులు వచ్చినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12.30గంటల సమయంలో జిరిబమ్‌లోని ఛోటోబక్రాలోని దాడి ప్రారంభమైనట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. మొదట ఛోటోబక్రా పోలీస్ స్థావరంపై దాడి జరిగిందని, అనంతరం లాంటైఖునౌ, మోధుపూర్‌లలోని పోలీస్ స్థావరాలపై తిరుగుబాటుదారులు దాడి చేసినట్లు వెల్లడించారు.

సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ ఉన్మాద దాడులు

- 55 మంది మృతి, వందలాదిగా క్షతగాత్రులు
- అల్ అక్సా ఆస్పత్రిలో హృదయ విదారక దృశ్యాలు

గాజా : అడ్డూ అదుపు లేకుండా వైమానిక, భూతల, సముద్ర దాడులతో గాజాపై ఇజ్రాయిల్ విరుచుకు పడుతోంది. విరామం లేకుండా కొనసాగుతున్న ఈ దాడులతో పెద్ద సంఖ్యలో ప్రజలు చనిపోతున్నారని, వందల సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. శనివారం డజన్ల సంఖ్యలో వైమానిక దాడులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా సెంట్రల్ గాజాలోని డేర్ అల్ బాలాహ్ ప్రాంతం వణికిపోయింది. అలాగే రఫాపై, ఉత్తర గాజాలోని పలు ప్రాంతాలపై కూడా దాడులు కొనసాగాయి. మరణించినవారి మృతదేహాలను అల్ అస్పత్రికి తీసుకువస్తున్నారని, అలాగే గాయపడిన వారు కూడా మెజారిటీ సంఖ్యలో ఇక్కడకే వస్తున్నారని, వీరిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలే వున్నారని వైద్య బృందాలు తెలిపాయి. అయితే ఇంతమంది రావడంతో ఆస్పత్రిలో పడకలు చాలక నేలపైనే పడుకోబెట్టాల్సి వస్తోందని చెప్పారు. డజన్ల సంఖ్యలో ప్రజలు గాయాలతో బాధపడుతూ నేలపై ఎక్కడబడితే అక్కడ పడివుండడం కనిపిస్తోంది. తమ దగ్గర వున్న ప్రాథమిక సదుపాయాలతోనే వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని డాక్టర్లు పేర్కొంటున్నారు. మందులు, ఆక్సిజన్, ఆహారం, ఇలా ఏవీ అందుబాటులో లేవని మరీ ముఖ్యంగా ఇంధనం కొరతతో ప్రధాన జనరేటర్ ఆగిపోయిందని చెప్పారు. అల్ అక్సా మార్టియర్స్ ఆస్పత్రి ప్రతినిధి ఒక పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, డేర్ అల్ బాలాహ్‌పై దాడి తర్వాత ఇక్కడకు వచ్చిన వారిలో 55మంది మరణించారని, డజన్ల సంఖ్యలో గాయపడినవారు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇంకా వీధుల్లో పలు మృత దేహాలు పడివున్నాయని, క్షతగాత్రులు కూడా వున్నారని చెప్పారు. భీకరంగా దాడులు

గాజా స్ట్రిప్‌లోని ఆల్ అక్సా ఆసుపత్రి వద్ద ఇజ్రాయిల్ ఉన్మాద దాడుల్లో బలైపోయిన తమ బంధువులకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న పాలస్తీనియన్లు

కొనసాగుతుండడంతో కమ్యూనికేషన్ సంబంధాలు కూడా దారుణంగా దెబ్బతిన్నాయి. భయకంపితులైన ప్రజలు ఎక్కడకు వెళ్ళాలో తెలియక దిక్కుతోచక వీధుల్లో తిరుగుతుండడం కనిపిస్తోందని మీడియా వార్తలు తెలిపాయి. ప్రతి నిముషానికి ఒకో పేలుడు వినిపిస్తోంది. అంబులెన్సులు బిజీగా రోడ్లపై తిరుగుతున్నాయి. ఆస్పత్రిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఆ వార్తలు పేర్కొన్నాయి.

నలుగురు బందీలను విడిపించాం

నుస్రత్‌లో చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా నలుగురు బందీలను విడిపించుకున్నామని ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది. వారందరి ఆరోగ్య పరిస్థితి బాగానే వుందని తెలిపింది. నుస్రత్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో వారిని కనుగొన్నామని తెలిపింది.

ఈ ఆపరేషన్ల సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వందలాదిమంది పాలస్తీనియన్ల గురించి అసలు ప్రస్తావనే లేదని మీడియా వ్యాఖ్యానించింది. సెంట్రల్ గవర్నరేట్‌లోని అన్ని ఏరియాల్లో దారుణంగా ఆర్మీ దాడులు కొనసాగిస్తోందని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బురెజి శరణార్థ శిబిరంపై ఉదయం జరిగిన దాడిలోఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మరణించారు. శరణార్థ శిబిరంగా మారిన స్కూలుపై ఎలాంటి హెచ్చరికలు లేకుండా దాడులు జరపడాన్ని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ఖండించింది.

డెన్మార్క్ ప్రధానిపై అగంతకుడి దాడి...అరెస్టు

కోపెన్‌హేగన్ : డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్సన్‌పై శుక్రవారం దాడి జరిగిందని ప్రధాని కార్యాలయం శనివారం ప్రకటించింది. సెంట్రల్ కోపెన్‌హేగన్‌లో ఒక వ్యక్తి ఆమెపై దాడికి దిగడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయని ఆ ప్రకటన తెలిపింది. దాడి జరిగిన వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ళి పరీక్షలు చేయించామని, ప్రస్తుతం ప్రధాని సురక్షితంగానే వున్నారని, అయితే ఈ దాడి కారణంగా ఆమె షాక్‌లో వున్నారని పేర్కొంది. ఈ కారణంగా శనివారం నాటి ప్రధాని అధికారిక కార్యాలయాలన్నీ రద్దయ్యాయి. దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేశారు. దర్యాప్తు సాగుతోందని తెలిపారు. అంతకుమించి వివరాలు ఇవ్వలేదు. ఇయు ఎన్నికల్లో డెన్మార్క్ ఓటింగ్‌కు రెండు రోజులు ముందుగా ఈ దాడి చోటు చేసుకుంది. మూడు వారాల క్రితం స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో కూడా ఇలాగే హత్యాయత్నంలో తీవ్రంగా గాయపడ్డారు.

ఐకమత్యంగా..బిజెపికి బుద్ధి చెప్పిన హిందూ-ముస్లిం ఓటర్లు

- ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో కాషాయ పార్టీకి ఝలక్

న్యూఢిల్లీ : ఈ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు బిజెపికి గట్టి షాక్‌ను ఇచ్చాయి. చార్ సౌ పార్ నినాదంతో వెళ్లిన బిజెపికి కనీసం కూటమితో కలుపుకొని 300 సీట్లను కూడా సాధించకుండా చతికిలపడిపోయింది. బోటాబొటి మెజారిటీతో కూటమిలోని పార్టీల సహాయంతో మోడీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. అయితే, గత ఎన్నికలకు భిన్నంగా బిజెపికి హిందూ-ముస్లింలు షాకిచ్చారనీ, ఇక్కడ వారి ఐకమత్యం కాషాయపార్టీకి సీట్లు తగ్గటానికి బలమైన కారణంగా పని చేసిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రధానిగా మోడీ తన అనేక టీవీ ఇంటర్వ్యూలలో ముస్లింలను కొంతవరకు అభ్యర్థించారు. 'నేను మొదటిసారిగా ముస్లిం సమాజానికి, వారిలో బాగా చదువుకున్న ప్రజలకు చెబుతున్నాను. ఆత్మపరిశీలన చేసుకోండి. మీరు ఎందుకు వెనుకబడి ఉన్నారు? కారణం ఏమిటి? కాంగ్రెస్ హయాంలో మీకు ఎందుకు ప్రయోజనాలు రాలేదు? ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు మారుతున్నారు' అంటూ మోడీ ముస్లింలను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. అయితే, ముస్లింలు అతని మాట విన్నట్టు కనిపించడం లేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. ముఖ్యంగా, యూపీ, పశ్చిమ బెంగాల్ ఫలితాలను చూస్తే ఇది అర్థమవుతుంది. ఇక్కడ ఈ సారి ఎన్‌డిఎ కంటే ఎక్కువ ఓట్ల వాటాను ఇండియా బ్లాక్‌లోని పార్టీలు పొందాయి.

మోడీ కాలంలోని మూడు లోక్‌సభ ఎన్నికల్లో (2014, 2019, 2024), 2017, 2022 విధానసభ ఎన్నికలలో యూపీలో 80 లోక్‌సభ లేదా 403 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా బిజెపి నిలబెట్టలేదు. అయినప్పటికీ, బిజెపి సర్వశక్తిమంతమైన మెజారిటీలను సాధించింది. అయితే, ముస్లిం వర్గం పట్ల బిజెపి తీరుతో పాటు బిజెపిలోని అగ్రనాయకత్వం మధ్య ఆధిపత్య పోరే యూపీలో కషాయపార్టీకి నష్టాన్ని చేకూర్చిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇదే బిజెపికి పెద్ద ఆందోళన కలిగించే అంశమని వారు అంటున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో 20 శాతం, పశ్చిమ బెంగాల్ జనాభాలో దాదాపు 33 శాతం మంది ముస్లిం జనాభా ఉన్నది. 2019లో బిజెపి పశ్చిమ బెంగాల్‌లోని 42 ఎంపీ స్థానాలకు గానూ 18 స్థానాలను గెలుచుకున్నది. ఇప్పుడు మాత్రం 11 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడింది. సీట్లు వచ్చే అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపి సింపుల్ ఫార్ములానే అనుసరిస్తున్నది. హిందువులను రెచ్చగొట్టి గంపగుత్తగా ఓట్లు పడేలా చేసుకోవటమే బిజెపి ప్లాన్. అయితే, ఇది యూపీ, పశ్చిమ బెంగాల్‌లోని ముస్లింలనే కాకుండా, హిందువులనూ ఆలోచింపజేసింది. బిజెపి కుయుక్తులను అర్థం చేసుకున్న వీరు.. ఊహించని షాకింగ్ ఫలితాలను కమలం పార్టీకి ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో "మహిళలపై అఘాయిత్యాల" అంశాన్ని బిజెపి లేవనెత్తినా.. అక్కడి ప్రజలు నమ్మలేదని చెప్తున్నారు. ఈ కారణాలతో హిందూ-ముస్లిం ఓటర్ల ఐకమత్య బలం కాషాయపార్టీకి అర్థమైందనీ, ఇది భవిష్యత్ రాజకీయాలకు మంచి సూచిక అని మేధావులు, సామాజికవేత్తలు అంటున్నారు.

తగ్గిన 'వందేభారత్' వేగం

న్యూఢిల్లీ : వందేభారత్ రైళ్ల వేగం తగ్గిపోతోంది. 2020-21లో సగటున గంటకు 84.48 కిలో మీటర్ల వేగంతో నడిచిన వందేభారత్ రైళ్లు 2023- 24లో 76.25 కిలోమీటర్ల వేగంతో మాత్రమే నడిచాయి. మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు జరుగుతు న్నందున ఈ రైళ్లు మాత్రమే కాకుండా అనేక ఇతర రైళ్లు కూడా జాగరూకతతో కూడిన వేగంతో ప్రయాణిస్తున్నా యని రైల్వే అధికారులు తెలిపారు. దీనితో పాటు వాతావరణం అను కూలంగా లేకపోవడంతో కొన్ని చోట్ల రైళ్ల వేగాన్ని నియంత్రించాల్సి వచ్చిందని వారు చెప్పారు. భౌగోళిక పరిస్థితులు కూడా రైళ్ల వేగం తగ్గడానికి కారణమవుతున్నాయని వివరించారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS (0/0 DISTRICT REGISTRAR OF REGISTRATION OF CHITS) AT GUNTUR, GUNTUR DISTRICT
DISPUTE No. 41 / 2023

BETWEEN:
M/s. SHRIRAM CHITS INDIA (P) LTD., Guntur-I Branch
Rep by its Legal Manager/G.P.A.Holder ..... Disputant.

VERSUS

Devarapalli Murali Krishna Reddy and others ..... Opponents

3.Byra Venkata Koteswara Rao, S/o Nageswara Rao, Hindu, aged 42 years, Employee W/as Police Constable- 2963, Emp code.2502073, APSPF, Vijayawada and R/o D.No.40 Purushothamapatnam, Chilakaluripet, Palnadu District.

4.Jandrajapalli Koteswara Rao, S/o Singaiah, Hindu, aged 45 years, Employee, W/as Police Constable (SPF), Vijayawada and R/o D.No.61-8/6-2b, Kotinagar, Doordarshan quarters, Police colony, Krishnalanka, Vijayawada. .....Opponents.

Whereas the above named disputant has instituted a claim for recovery of Rs.4,81,351/- against you are hereby Summoned/Notice to appear in this Tribunal (Deputy Registrar of Chits) in person on the 11 Day of _JUNE 2024 at O/o District Registrar, Guntur 10.30 A.M. in the forenoon, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defense.

Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.

Given under my hand and seal of the Court, this _30_ day of APRIL 2024.

DEPUTY REGISTRAR OF CHITS, Guntur.

వేసవి విడిది

అమ్మ మాట పూలబాట

అనగనగా రామాపురంలో రాజారాం అనే పెద్ద రైతు ఉన్నాడు. అతడు తన పొలంలో జొన్న పంట వేశాడు. పంట ఏపుగా చాలా బాగా పండింది. ప్రతిరోజూ పిచ్చుకలు వచ్చి, జొన్నలను తింటున్నాయి. అందులో ఒక పిచ్చుకమ్మ అక్కడే గూడు కట్టుకుని, గుడ్లు పెట్టింది. పిల్లలు పెద్దయ్యాక, తల్లి పిచ్చుక ఆహారం తేవడం కోసం రోజూ ఉదయం పూట గూడు నుంచి బయటకు వెళ్లి మరల సాయంత్రం వచ్చేది. పిల్లలకి చాలా జాగ్రత్తలు చెప్పి 'గూడు నుండి బయటకు రావొద్దు' అని వెళ్లేది.

ఒకరోజు రైతు రాజారాం, కొడుకుని తీసుకుని పొలానికి వచ్చాడు. వస్తూనే 'నాయనా! జొన్నలు బాగా పండాయి. రేపు చేను అంతా కోసి మన ఇంటికి పట్టుకు వెళ్లాలి' అని చెప్పాడు. ఆ మాటలు విన్న పిచ్చుక పిల్లలు భయపడుతూ ఉన్నాయి. తల్లి పిచ్చుక సాయంత్రం రాగానే 'అమ్మ! రైతు వచ్చి రేపు చేను అంత కోయమని తన కొడుకుతో చెప్పాడు. మన గూడు పోతుందని భయంగా ఉంది' అన్నాయి. 'హా! ఏమీ కాదు.. మీరేమీ భయపడకండి' అని చెప్పి మళ్ళీ ఉదయం తల్లి పిచ్చుక మేత కోసం బయటికి వెళ్ళింది. ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి పిచ్చుక పిల్లలన్నీ భయంతో వణుకుతూ 'అమ్మ,! అమ్మ! మళ్లీ రైతు వచ్చి కొంతమంది మనుషులని తెచ్చి పంట అంతా రేపు కోయాలి... అని చెప్పాడు' అన్నాయి. 'ఓ! అదా సంగతి, ఏం ఫరవాలేదు. మీరేమీ భయపడకండి' అని చెప్పి, షరా మామూలుగా ఉదయం మేతకు బయలుదేరింది తల్లి పిచ్చుక.

ఆ రోజు సాయంత్రం మాత్రం, గూడుకు వచ్చిన తల్లి పిచ్చుక తన పిల్లలు చాలా నింపాదిగా కూర్చొని ముచ్చట్లు ఆడుకోవడం చూసి చాలా సంతోషించింది. పిల్లలను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని 'ఏంటీ ఈ రోజు ఆ రైతు పంట గురించి ఏమీ అనలేదా? అందరూ చాలా సంతోషంగా ఉన్నారు' అని అడిగింది.

'అదేం లేదమ్మా, ఈ రోజు కూడా రైతు పొలం దగ్గరకు వచ్చాడు. పంట బాగా పండింది. ఆలస్యం చేస్తే నష్టపోతాను. రేపు నేనే కొంతమంది పని వాళ్ళని తెచ్చి చేను కోసి ఇంటికి పట్టుకు వెళ్లాలి' అనుకుంటూ వెళ్లిపోయాడు. అంతమంది వల్ల కానిది, రైతు ఒక్కడి వల్ల ఏమీ కాదని మేం నింపాదిగా కూర్చున్నాం' అన్నాయి పిల్ల పిచ్చుకలు. ఆ మాటలు విన్న తల్లి పిచ్చుక, వెంటనే తన గూడుని చెట్టు మీదకి మార్చేసింది. అప్పుడు పిచ్చుక పిల్లలు 'ఎందుకమ్మా! రోజూ మేం చెబుతున్నా నువ్వు పట్టించుకోలేదు. ఈరోజు మాత్రం, వెంటనే గూడు మార్చేశావు' అని అడిగాయి 'తన పని తానే చేస్తానని రైతు పూనుకున్నప్పుడు అది తప్పకుండా జరుగుతుంది. రైతు ఎవరి మీద ఆధారపడడు. తన కష్టాన్ని తానే నమ్ముకుంటాడు' అని తల్లి పిచ్చుక చెప్పినట్లే, మరుసటి రోజు ఉదయం రైతు చేను అంతా కోసి పంటను ఇంటికి పట్టుకుని వెళ్ళాడు.

- బల్ల కృష్ణవేణి పలాస

తొలకరి చినుకులు

తొలకరి వాన కురిసింది
భూమి తాపం చల్లార్చింది
చల్లదనాన్ని ఇచ్చింది
ఎండ వేడిమి తగ్గించింది

పచ్చిక పచ్చగా మెరిసింది
చిగురు తొడిగి వెలిగింది
చిట్టి మొక్క మొలిచింది
చిన్న చిన్నగా పెరిగింది

చిటపట చినుకు పడింది
నాగలి పొలాన్ని దున్నింది
విత్తనాలను చల్లింది
పంటకు ప్రాణం పోసింది

పిల్ల కాలువ పారింది
చెరువు తొణికిసలాడింది
చేపకు ఉత్సాహమేసింది
ఎగిరి ఎగిరి దుమికింది

వాన మేఘం కదిలింది
జడి వాన బాగా కురిసింది
మిల మిల మెరుపు వచ్చింది
ఫెళ ఫెళ ఉరుము ఉరిమింది

ప్రకృతి పులకరించింది
పక్షుల గుంపు వాలింది
అడవి కళకళలాడింది
కొండా కోనా మురిసింది

రెతు కళ్ళలో ఆనందం
మల్లె మొగ్గ విచ్చుకుంది
నేల అదునుకై ఆనందంగా
చిందులేస్తూ కదిలింది!

**- నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.**

బొమ్మరిల్లు



ఎం.డి.జ్యోతిర్మయి,
9వ తరగతి,
టి.సి.జి.హెచ్ స్కూలు,
పమిడి.



కె.నిర్వి,
6వ తరగతి,
సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు,
పురుషోత్తపట్నం.

కె. జ్ఞాన వైష్ణవి, 8వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు, మంగళగిరి.

మొర్రి హాసిని,
11వ తరగతి,
జవహర్ నవోదయ,
వెన్నెలవలస, కవిటి గ్రామం,
శ్రీకాకుళం జిల్లా.

JEEVANA జీవన the family

జీవన సారథం

సమయం చాలా విలువైంది. వేరే వాళ్ల గురించి ఆలోచిస్తూ, విమర్శిస్తూ కాలాన్ని వృథా చేసుకోవద్దు.

ఆటంకాలెన్నున్నా ఆటల్లో మేటి!

'విజయం మనకు ఒకే దారిని సూచిస్తుంది. కానీ అపజయం వంద పరిష్కారాలను అందిస్తుంది. అందుకే పరిష్కారం లేని సమస్య గురించి చింతించకు.. పరిష్కారం ఉన్న సమస్యను వదలకు..' అంటూ పెద్దలు చెప్పిన సూక్తి ఈ సిక్కోలు యువకెరటానికి వర్తిస్తుంది.

ఆ యువకుడిది నిరుపేద కుటుంబం.. ఆర్థిక ఇబ్బందులు... వికలాంగుడు. ఇలాంటి పరిస్థితుల్లో ఆటల్లో రాణించటం అంత సులువేమీ కాదు. కానీ, ఎంతో కఠోర శ్రమతో అతడు సాధించాడు. ఆ విజయం వెనుక నిరంతర శ్రమ... అనేక త్యాగాలు.. ఎన్నో కట్టుదిట్టమైన నిర్ణయాలు దాగున్నాయి. అనేక అడ్డంకులను అధిగమనించి వాలీబాల్, బీచ్ వాలీ బాల్ పోటీల్లో ఈ సిక్కోలు యువకుడు ఉప్పెనలా దూసుకొచ్చాడు. అతడే శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడ మత్స్యలేశం గ్రామానికి చెందిన మైలపల్లి వెంకట రమణ. ఇటీవల చైనాలో జరిగిన ప్రపంచ పారా బీచ్ వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు.

వెంకటరమణ తల్లిదండ్రులు కృష్ణ, లక్ష్మి మత్స్యకారులు. చేపలవేటే వీరి జీవనాధారం. చిన్నతనంలో పోలియో బారిన పడటంతో వెంకట రమణ కుడికాలు వంకరపోయింది. అయినప్పటికీ ఆటలపై మక్కువతో చిన్నప్పటినుంచీ అలుపెరగని సాధన చేశాడు. ఇంటర్ చదువు పూర్తి కాగానే డీపీఈడీ చేసి వ్యాయామోపాధ్యాయుడిగా ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని తపన పడ్డారు. క్రికెట్, వాలీబాల్, రన్నింగ్ క్రీడల్లో చాలా నైపుణ్యం సంపాదించాడు. ప్రాథమిక పాఠశాల దశ నుంచే ఆటలపై ఇష్టంతో వాటిలో ప్రావీణ్యం కోసం నిరంతరం శ్రమించాడు. ప్రస్తుతం రణస్థలం కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ వాలీబాల్ శిక్షకుడు కళ్లేపల్లి హరికృష్ణ వద్ద శిక్షణ పొందాడు. మెళకువలను నేర్చుకుని పట్టు సాధించారు. ప్రపంచ పారా బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నాడు. మే 28 నుంచి జూన్ ఐదో తేదీ వరకూ చైనాలో జరిగిన పోటీల్లో భారత్ జట్టు ద్వితీయ స్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఇప్పుడు పారా ఒలింపిక్స్, పారా సూపర్ సిక్స్ వాలీబాల్ పోటీల్లోనూ సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నాడు.

జాతీయ పోటీల్లో రాణింపు

- విశాఖపట్టణంలో జరిగిన పారా సిటింగ్ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో వెంకట రమణ పాల్గొన్న జట్టు ద్వితీయ స్థానం సాధించింది.
- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం తరపున సౌత్ ఇండియా యూనివర్శిటీ వాలీబాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు.
- సకలాంగులతో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.
- విశాఖపట్టణంలో నిర్వహించిన పారా రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో 100 మీటర్లు ఫ్రైస్టైల్, 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నాడు.
- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, జావెలిన్ త్రో క్రీడాంశాల్లో తృతీయ స్థానం పొందాడు.

పతకాలు సాధిస్తా ...

నా జీవితంలో పేదరికం కారణంగా అనేక అవకాశాలను కోల్పోయాను. నా తల్లిదండ్రులు నాపై ఉన్న నమ్మకంతో చైనాలో పోటీలకు వెళ్లాను. ఆత్మవిశ్వాసంతో జట్టుగా విజయాన్ని సాధించాం. కళ్లేపల్లి హరికృష్ణ నాకు మంచి శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో భారతదేశానికి మరిన్ని పతకాలను తీసుకురావటానికి కృషిచేస్తా.

-మైలపల్లి వెంకటరమణ

అప్పు చేసి .. చైనాకు

చైనాలో జరిగే పోటీలకు ఎంపికైనా అక్కడికి వెళ్లటానికి వెంకట రమణ ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తల్లిదండ్రులు ఇంట్లో ఉన్న కొద్దిపాటి బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.3 లక్షలు అప్పు తెచ్చారు. చైనాలో జరిగిన పోటీలకు వెళ్లి రావటానికి రూ.3 లక్షల వరకూ ఖర్చయ్యింది. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి సహాయం అందలేదు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఉపయోగం లేకుండా పోయింది. చివరకు వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోలేక అప్పుచేసి పోటీలకు తల్లిదండ్రులు పంపించారు. అక్కడకు వెళ్లిన వెంకట రమణ సత్తా చాటాడు. వాస్తవంగా 2023 పోటీల్లోనే పాల్గొనే అవకాశం కూడా వచ్చింది. అప్పుడు కూడా ఇలాంటి ఆర్థిక ఇబ్బందులే తరుముకొచ్చాయి. అందుకే వెళ్లలేదు. ఈ ఏడాది తల్లిదండ్రులు తలతాకట్టు పెట్టయినా పంపిస్తామని చెప్పి డబ్బులు పోగుచేయటంతో వెళ్లాడు.

ప్రోత్సాహం లేక...

ప్రోత్సాహం లేక రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎందరో నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి రావటం లేదు. ఆర్థిక కష్టాలు వేధిస్తుండటంతో పలువురు అవకాశాలను చేజిక్కించుకుంటున్నారు. అలాంటి వారికి దాతలు, ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే దేశం తలెత్తుకునేలా విజయాలు సాధిస్తారనటంలో ఎలాంటి సందేహం లేదు. **- యడవల్లి శ్రీనివాసరావు**

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్
టైటిల్ విజేత స్వైటెక్

- ఫైనల్లో పౌలినీపై గెలుపు

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్‌ను పోలండ్‌కు చెందిన టాప్‌సీడ్ ఇగా స్వైటెక్ చేజిక్కించుకుంది. రొలాండ్ గారోస్‌లో ఏకపక్షంగా సాగిన ఫైనల్లో స్వైటెక్ వరుససెట్లలో 28ఏళ్ల ఇటలీకి చెందిన 12వ సీడ్ పౌలినీపై సునాయాస విజయాన్ని నమోదు చేసుకుంది. వరుసగా మూడో ఏడాదీ ఈ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకోవడంతోపాటు కెరీర్‌లో నాల్గో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను చేజిక్కించుకొని మార్టీనా నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్ సరసన నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో స్వైటెక్ 6-2, 6-1తో ఫౌలినిని చిత్తుచేసింది. టైటిల్‌ను చేజిక్కించుకొనే క్రమంలో స్వైటెక్ ప్రత్యర్థికి కేవలం మూడు పాయింట్లు మాత్రమే ఇచ్చింది. 28ఏళ్ల పౌలినీ 23ఏళ్ల స్వైటెక్ జోరు ముందు నిలువలేకపోయింది.

పురుషుల సింగిల్స్ ఫైనల్ ఆదివారం జరగనుంది. 3వ సీడ్, అల్కరాజ్(స్పెయిన్), 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ)ల ఈ మధ్య టైటిల్ పోరు జరగనుంది.

మూడుసార్లు ఈ టైటిల్ గతంలో సెరెనా విలియమ్స్(2002, 2013, 2015) కూడా చేజిక్కించుకుంది. స్వైటెక్ కెరీర్‌లో ఇది నాల్గో ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా.. యుఎస్ ఓపెన్ టైటిల్‌ను 2022లో చేజిక్కించుకొంది. స్వైటెక్ 2020, 2022, 2023, 2024లలో ఈ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. అలాగే ఈ టోర్నమెంట్‌లో స్వైటెక్ మొత్తం 20మ్యాచుల్లో 18వరుస విజయాలతో తన రికార్డునూ మెరుగుపరుచుకుంది.

స్వైటెక్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్ చేరిన ప్రతిసారి ట్రోఫీ గెలిచిన రికార్డు సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ ఐదుసార్లు ఫైనల్ చేరిన ఆమె ఐదింటా జయభేరి మోగించి విజేతగా నిలిచింది. ఈ ఏడాది ఆరంభంలో స్వైటెక్ యుఎస్ ఓపెన్ టైటిల్ సాధించింది. అదే జోరును కొనసాగించిన ఆమె మట్టి కోటలో మహారాణిగా ఎదిగింది.

ఆ ఇద్దరు ముందే ఓటమితో..

ఫ్రెంచ్ ఓపెన్‌లో కఠిన ప్రత్యర్థులు అరినా సబలెంక, కొకొ గాఫ్‌లు సెమీస్‌లోనే వెనుదిరగడం.. స్వైటెక్ సెమీస్‌లో కోకా గాఫ్‌ను ఓడించింది. టోర్నీ ఆసాంతం సంచలన విజయాలు సాధించిన ఇటలీ సంచలనం జాస్మిన్ ఫౌలిని టైటిల్ పోరులో తడబడింది. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన ఇటలీ అమ్మాయి టాప్ సీడ్ జోరు ముందు నిలవలేకపోయింది.

ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌తో స్వైటెక్



రన్నరప్ ట్రోఫీతో పౌలిని

స్వైటెక్ టైటిల్ గెలిచింది ఇలా..

ఫైనల్	ఫౌలిని(ఇటలీ)పై 6-2, 6-1(గెలుపు)
సెమీఫైనల్	కోకా గాఫ్(అమెరికా)పై 6-2, 6-4(గెలుపు)
క్వార్టర్‌ఫైనల్	వోంద్రుసోవా(చెక్)పై 6-0, 6-2(గెలుపు)
ప్రి క్వార్టర్స్	పొటపొవా(రష్యా)పై 6-0, 6-0(గెలుపు)
మూడోరౌండ్	బౌచ్‌కోవా(చెక్)పై 6-4, 6-2(గెలుపు)
రెండోరౌండ్	ఒసాకా(జపాన్)పై 7-6(7-1), 1-6, 5-7(గెలుపు)
తొలిరౌండ్	జీన్‌జియాన్(ఫ్రాన్స్)పై 6-1, 6-2(గెలుపు)

మరో రెండు సంచలన విజయాలు..
శ్రీలంకపై బంగ్లా, న్యూజిలాండ్‌పై ఆఫ్ఘన్ గెలుపు

గయానా: టి20 ప్రపంచకప్‌లో సంచలనాలు నమోదవుతున్నాయి. పాకిస్తాన్‌ను అమెరికా చిత్తుచేసి తొలుత పెను సంచలనాన్ని నమోదు చేయగా.. శనివారం జరిగిన మ్యాచుల్లో శ్రీలంకను బంగ్లాదేశ్ ఓడించగా.. టైటిల్ రేసులో ఉన్న న్యూజిలాండ్‌ను ఏకంగా ఆఫ్ఘనిస్తాన్ చిత్తుచేసింది. గ్రూప్-సిలో భాగంగా ఆఫ్ఘనిస్తాన్ జట్టు 84పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 159పరుగులు చేయగా.. ఛేదనలో న్యూజిలాండ్‌ను 15.2ఓవర్లలో 75పరుగులకే ఆలౌట్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గుర్బాజ్(80పరుగులు)కు లభించింది. ఈ గెలుపుతో ఆఫ్ఘనిస్తాన్ జట్టు వరుసగా 2మ్యాచుల్లో విజయాలతో టాప్‌లో నిలిచింది. ఇక గ్రూప్-డిలో బంగ్లాదేశ్ జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై 2వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత శ్రీలంకను 124పరుగులకే కట్టడి చేసిన బంగ్లాదేశ్.. ఆ తర్వాత 8 వికెట్లు కోల్పోయి 19ఓవర్లలో లక్ష్యాన్ని అందుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రషీద్ హొసైన్‌కు లభించింది. ఈ గ్రూప్‌లో శ్రీలంకకు ఇది వరుసగా రెండో పరాజయం. తొలి మ్యాచ్‌లో లంక జట్టు దక్షిణాఫ్రికా చేతిలో 6వికెట్ల తేడాతో ఓడింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ × ఉగాండా
వేదిక: గయానా; ఉ.6.00గం॥లకు

భారత్ × పాకిస్తాన్
వేదిక: న్యూయార్క్; రా.8.00గం॥లకు

ఒమన్ × స్కాట్లాండ్
వేదిక: ఆంటిగ్వా; రా.10.30గం॥లకు



నేడు భారత్-పాకిస్థాన్ ఢీ
రాత్రి 8.00గం॥ల నుంచి

న్యూయార్క్: క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ మరికొద్ది గంటల్లో జరగనుంది. ప్రతిష్ఠాత్మక టి20 ప్రపంచ కప్‌లో భాగంగా నసావు కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. అమెరికా చేతిలో ఓటమితో పాకిస్తాన్‌కు ఈ మ్యాచ్‌లో గెలుపు తప్పని సరి కాగా.. టీమిండియా ఐర్లాండ్‌పై గెలిచిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. టి20 ప్రపంచకప్ గ్రూప్ దశలో పాకిస్తాన్ చేతిలో టీమిండియా ఒక్కసారి మాత్రమే ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ టికెట్లన్నీ ఇప్పటికే హాట్‌కేకుల్లా అమ్ముడైన సంగతి తెలిసిందే. **భారత్(అంచనా) : రోహిత్(కెప్టెన్), జైస్వాల్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా/అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.**

పాకిస్తాన్: **బాబర్(కెప్టెన్), రిజ్వాన్(వికెట్ కీపర్), ఉస్మాన్, ఫకర్ జమాన్, షాదాబ్, అజామ్, ఇఫ్తికార్, షాహిన్, రవూఫ్, నసీమ్ షా, అమీర్.**

ENTRY	Air Force Common Admission Test (AFCAT) Entry	NCC Special Entry
BRANCHES	Flying/ Technical/ Weapon Systems/ Administration/ Logistics/ Accounts/ Education/ Meteorology	Flying (NCC Air Wing 'C' certificate is mandatory)

AFCAT Entry: Registration mandatory and online exam/ NCC Special Entry registration mandatory and no online exam
Aadhaar card is mandatory for online registration
Registrations open from **30 May 2024** till **28 June 2024**
For more details, refer to Employment News dated **25 May 2024** and for detailed notification visit our website **careerairforce.nic.in** and **afcat.cdac.in**
For updates, follow us on
DISHA by Indian Air Force | careeriniaf | CareerinIAF
DISHA Cell, Air Headquarter, Vayu Bhawan
Tel: 011-23013690 | Toll-free No.: 1800-11-2448 | E-mail: career.iaf@nic.in
cbc 10801/13/0004/2425

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68